DATE: 15-07-2022
RNI NO : TELTEL/2021/81092

# ప్రజా మంటలు

తెలుగు జాతీయ దినపత్రిక
ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు
prajamantalu.com

సంపుటి(Volume) : 3
సంచిక(Issue) : 92
పేజీలు - 08
వెల: రూ 5/-

శుక్రవారం
15 జూలై, 2022

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak, Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri Bhuvanagiri,




నేటి తెలంగాణలో నుంచి ఉచితంగా బూస్టర్ డోస్ ప్రభుత్వ దవాఖానాల్లో ఇవ్వనున్న ప్రభుత్వం 5లో



శ్రీలంక అధ్యక్షుడు గొటబాయ రాజపక్స రాజీనామా ధ్రువీకరించిన శ్రీలంక పార్లమెంట్ స్పీకర్ 5లో



# పంప్‌హౌస్‌లోకి వరద

## కాళేశ్వరం వద్ద పెరుగుతున్న గోదావరి ప్రవాహం

### నీట మునిగిన 17 బాహుబలి మోటార్లు

- ప్రభుత్వతీరుపై మండిపడుతున్న విపక్షాలు
- సీఎం కేసీఆర్ నిర్వాకం వల్లే రూ.వేల కోట్లు వృథా
- భాజపా రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్
- కేసీఆర్ నిర్లక్ష్యం వల్లే కాళేశ్వరం మునిగింది
- కేసీఆర్ అవినీతికి కాళేశ్వరం బలి
- తెలంగాణ పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి

**హైదరాబాద్,జూలై14:** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు జలాశయాలన్ని నిండుకుండలా మారాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ మండలం కాళేశ్వరం వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుంది. కాళేశ్వరంలోని కీలకమైన కన్నెపల్లి పంప్‌హౌస్‌లోకి భారీగా వరద నీరు వచ్చి చేరింది. పంపు హౌస్‌లోని 17 బాహుబలి మోటార్లు నీటమునిగాయి. గ్రౌండ్ లెవల్లో ఉన్న మోటార్లు పూర్తిస్థాయిలో మునిగిపోవడంతో ఏం చేయలేని పరిస్థితిలో అధికారులు వెనుదిరిగారు. మరోవైపు పంప్‌హౌస్‌లోకి భారీగా వరద నీరు చేరడంపై విపక్షాలు మండిపడుతున్నాయి. ముఖ్యమంత్రి కేసీఆర్ వైఫల్యం వల్లే కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన అన్నారం పంప్‌హౌస్ నీటమునిగిందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ మండిపడ్డారు. అంచనా వ్యయాన్ని పెంచి రూ.వేల కోట్లు దండుకోవడంలో చూపిన శ్రద్ధ ప్రాజెక్టు నిర్మాణంపై చూపకపోవడం సిగ్గుచేటన్నారు. అపర భగీరథుడు, తెలంగాణలో నదులకు నడక నేర్పానని, ప్రపంచంలోనే అతిపెద్ద ఇంజినీరింగ్ నిపుణుడిని తానేని ప్రగల్భాలు పలికిన ముఖ్యమంత్రి కేసీఆర్ సిగ్గుతో తలదించుకోవాలని మిగతా 2లో..

# గోదావరి మహోగ్రరూపం

## జలదిగ్బంధంలో భద్రాద్రి

### తీర ప్రాంతాలు అతలాకుతలం

### ప్రమాదకర స్థాయిని దాటి ప్రవహిస్తోన్న గోదావరి

### ఉగ్రరూపం దాల్చిన మేడారం జంపన్న వాగు

### ప్రమాదకర స్థాయిలో వాగుకు పోటెత్తిన వరద

- కడెం ప్రాజెక్టుకు తప్పిన ముప్పు
- భారీగా వచ్చి చేరిన చెత్తా చెదారం
- ఇన్‌ఫ్లో తగ్గిందని వెల్లడించిన అధికారులు
- ప్రాజెక్టు వద్దే పర్యవేక్షణలో అధికారులు
- నిజామాబాద్‌ను వీడని వర్షం
- భారీ వర్షాలతో నిజామాబాద్ అతలాకుతలం
- 9వేల 591 ఎకరాల పంట నష్టం
- వర్షాల ధాటికి పొంగిపొర్లుతున్న వాగులు
- 50కి పైగా ప్రాంతాల్లో నిలిచిన రాకపోకలు
- ఎగువ నుంచి వరదతో సింగూరుకు పెరిగిన ప్రవాహం
- నిండుకుండలా జిల్లాలోని చెరువులు, ప్రాజెక్టులు
- అధికారులను అప్రమత్తం చేసిన జిల్లా కలెక్టర్
- తెలంగాణలో మరోమారు అతి భారీ వర్షాలు



**భద్రాచలం,జూలై14:** భద్రాచలం వద్ద గోదావరి మహోగ్రరూపం దాల్చడంతో తీర ప్రాంతం అతలాకుతలమమవుతోంది. ఎగువ ప్రాంతాల నుంచి ఉవ్వెత్తున ఎగిసిపడుతూ వచ్చిన వరదపోటు భద్రాద్రిలో ప్రమాదకర స్థాయిని దాటి ప్రవహిస్తోంది. నదీపరివాహక ప్రదేశాల్లో భారీ ఎత్తున వరద చేరి భయానక వాతావరణం చోటుచేసుకుంది. ఫలితంగా గోదావరి తీరప్రాంతాలు చిగురుటాకులా వణికిపోతున్నాయి. ముంపు బాధితులు ఇప్పటికే పునరావాస కేంద్రాల్లో తలదాచుకుంటుండగా.. ఇళ్ల వద్దే ఉన్న బాధితులు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. జులై మొదటిపక్షంలోనే ఈ స్థాయిలో మిగతా 2లో..

# పరిస్థితి అదుపులోనే ఉంది

## బాధితులను సహాయక శిబిరాలకు తరలిస్తున్నాం

### వరదలపై సీఎస్ సోమేశ్ కుమార్ సమీక్ష



**హైదరాబాద్,జూలై14:** తెలంగాణలో వరదలు పోటెత్తుతున్నాయి. రాష్ట్రంలో వరద సహాయం, పునరావాస కార్యక్రమాలపై సీఎస్ సోమేశ్ కుమార్ సమీక్ష నిర్వహించారు. వరద ప్రభావిత ప్రాంతాల నుంచి 19,071 మందిని పునరావాస కేంద్రాలకు తరలించినట్లు వెల్లడించారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు, వరదల వల్ల పరిస్థితి అదుపులోనే ఉందని, ఏ విధమైన నష్టం జరగలేదని సీఎస్ తెలిపారు. గోదావరి ఉధృతంగా ప్రవహిస్తున్న ములుగు, భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం మిగతా 2లో..

## తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తాం

### రాష్ట్ర మంత్రి గంగుల కమలాకర్ కీలక ప్రకటన

### రైతులకు ఇబ్బంది లేకుండా చూస్తాం

**హైదరాబాద్,జూలై14:** ఎడతెగని వర్షాలతో అల్లాడుతున్న రైతులకు తెలంగాణ ప్రభుత్వం శుభ[illegible]ంది. ధాన్యం కొనుగోలుకు సంబంధించి రాష్ట్ర మంత్రి మిగతా 5లో..

7లో


# వరదముప్పు ఇంకా తొలగలేదు

- వర్షాలతో మరింత అప్రమత్తంగా ఉండాలి
- అధికారులకు దిశానిర్దేశం చేసిన మంత్రి కేటీఆర్
- అధికారులతో కలెక్టరేట్‌లో ఉన్నతస్థాయి సమీక్ష



**రాజన్న సిరిసిల్ల,జూలై14:** వరదలు, వర్షాలతో ఉత్పన్నమయ్యే పరిస్థితులను ఎదుర్కొనేందుకు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర పురపాలక, ఐటీ, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కెటిఆర్ అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఇంకా వరుణుడి బీభత్సం తొలగలేదు. భారీగా వరదలు పోటెత్తుతున్నాయి. ప్రాజెక్టులన్నీ నిండుకుండలా మారిపోయాయి. మిగతా 5లో..

## ప్రజానాడి




అక్టోబర్ 2 నుంచి

## భారత్ జోడో యాత్ర

12 రాష్ట్రాలలో యాత్రకు కాంగ్రెస్ శ్రీకారం 5లో

### భారత్‌లో మంకీపాక్స్

# తొలి కేసు నమోదు

### కేరళలో నమోదైనట్లు ఆరోగ్యశాఖ అధికారికంగా ప్రకటన

### మరోమారు పెరిగిన కరోనా కేసుల సంఖ్య

### 20వేల సంఖ్యను దాటిన పాజిటివ్ కేసులు

### కరోనాతో ఆసుపత్రిలో చేరిన స్టాలిన్



**న్యూఢిల్లీ,జూలై14:** ప్రపంచ దేశాలను కలవరపెడుతోన్న మంకీపాక్స్ భారత్‌కూ విస్తరించింది. తొలికేసు కేరళలో నమోదయ్యింది. ఈ విషయాన్ని కేరళ ఆరోగ్యశాఖ అధికారికంగా ధ్రువీకరించింది. తొలుత అనుమానిత కేసుగా గుర్తించిన అధికారులు, వైద్యపరీక్షల అనంతరం మంకీపాక్స్‌గా నిర్ధారించారు. ఈ నేపథ్యంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ ), భారత వైద్య పరిశోధనా మండలి మార్గదర్శకాల మేరకు మిగతా 5లో..

# గోదావరి మహోగ్రరూపం

మొదటిపేజీ తరువాయి..

వరదపోటెత్తడం గోదావరి చరిత్రలోనే ఇది రెండోసారి. 1976లో తొలిసారి భద్రాచలం వద్ద 63.9 అడుగుల నీటిమట్టం జూన్ 22న నమోదైంది. ఆ తర్వాత జులై రెండో వారంలో 60 అడుగులు దాటడం ఇదే ప్రథమం. ప్రస్తుతం గోదావరి నీటిమట్టం గురువారం సాయంత్రం 4 గంటలకు 61.5 అడుగుల వద్ద కొనసాగుతుంది. 1986లో గోదావరి వరదలకు భద్రాచలం పట్టణానికి తీవ్ర నష్టం వాటిల్లింది. ఆలయ పరిసరాల్లోని కాలనీలన్నీ నీటమునిగాయి. ఈ సమస్యను గుర్తించిన అప్పటి ప్రభుత్వం కరకట్ట నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఇప్పుడు ఈ కరకట్ట పట్టణానికి శ్రీరామరక్షగా మారింది. దాదాపు 80 అడుగుల మేర వరద వచ్చినా తట్టుకునేలా కరకట్ట నిర్మాణం చేపట్టినప్పటికీ స్లూయిస్‌ల నిర్మాణంలో లోపాల వల్ల లీకేజీలు తలెత్తేవి. అయితే, చాలా ఏళ్ల తర్వాత మళ్లీ గోదావరి నీటిమట్టం భారీగా పెరగడంతో ఈసారి ఏకంగా వరదనీరు కరకట్టను తాకింది. మొదటి ప్రమాద హెచ్చరిక 43, రెండో ప్రమాద హెచ్చరిక 48, మూడో ప్రమాద హెచ్చరిక 53 అడుగులు ఉండగా.. ప్రతీ హెచ్చరికకు మధ్య 5 అడుగుల వ్యత్యాసం ఉంది. మూడో ప్రమాద హెచ్చరిక దాటి 24 గంటలు గడవక ముందే ప్రవాహ ఉధ్ధృతి ఏకంగా 8 అడుగులకు మించి పోటెత్తడం గమనార్హం. గంట గంటకూ వరద ప్రవాహం క్రమంగా పెరుగుతూ వచ్చింది. బుధవారం రాత్రి 9 గంటలకు 55.1 అడుగులు ఉన్న గోదావరి నీటిమట్టం గురువారం ఉదయానికి 3 అడుగుల మేర పెరిగింది. ఆ తర్వాత వరద ప్రవాహం అంతకంతకూ పెరుగుతూ వచ్చింది. బుధవారం 14 లక్షల నుంచి 15 లక్షల క్యూసెక్కుల వరద నీరు దిగువకు విడుదల కాగా.. గురువారం ఏకంగా 18 లక్షల క్యూసెక్కుల వరద నీటిని దిగువకు వదిలారు. వాతావరణంలో వచ్చిన మార్పులతో వర్షపాతం గణనీయంగా నమోదుకావడం, ఎగువ నుంచి భారీగా వరద ప్రవాహం పోటెత్తడంతో భద్రాచలం వద్ద గోదావరి వారధి అతలాకుతలమైంది. వంతెన చరిత్రలో రెండోసారి రాకపోకలు నిలిపివేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. 1986లో తొలిసారిగా గోదావరి నీటిమట్టం 75.6 అడుగులకు చేరడంతో ముందు జాగ్రత్తగా గోదావరి వారధిపై రాకపోకలు నిలిపివేశారు. ఆ తర్వాత 36ఏళ్ల తర్వాత మళ్లీ గోదావరి వంతెనపై ఆంక్షలు విధిస్తూ రాకపోకలు నిషేధించారు. గురువారం సాయంత్రం 5 గంటల నుంచి 48 గంటల పాటు వారధిపై రాకపోకలు నిలిపివేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ అనుదీప్ ప్రకటించారు. దీంతో.. తెలంగాణ నుంచి ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఆంధ్ర ప్రాంతాలకు భద్రాచలం నుంచి పూర్తిగా రాకపోకలు నిలిచిపోయాయి. దీంతోపాటు భద్రాచలం, బూర్గంపాడు మండలాల మధ్య వరద తీవ్రత ఎక్కువగా ఉండటంతో 144 సెక్షన్ విధించారు. భారీ వరదలు ములుగుల్లాను అతలాకుతలం చేస్తున్నాయి. వరదలు పోటెత్తడంతో వాగులు, చెరువులు, నదులు ప్రమాదకరస్థాయిలో ప్రవహిస్తున్నాయి. జిల్లాలోని పలు లోతట్టు ప్రాంతాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలోని జంపన్న వాగు భారీ వర్షాలకు ఉగ్రరూపం దాల్చి ప్రవహిస్తుంది. మేడారం, రెడ్డిగూడెం చుట్టుపక్కల గ్రామాలలోకి వరద నీరు చేరింది. దీంతో ప్రజలు భయాందోళనతో బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. గత వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మేడారం వద్ద జంపన్న వాగు మహోగ్రరూపం దాల్చి ప్రవహిస్తుంది. పై నుంచి వచ్చే వరదతో పాటు సమీప ప్రాంతాల నుంచి వచ్చే వరదతో జంపన్న వాగు పొంగిపొర్లుతుంది. ములుగు జిల్లా ఏజెన్సీలో భారీ వరదలు పోటెత్తడంతో రహదారులు కోతకు గురయ్యాయి. చుట్టుపక్కల గ్రామాలకు సమీప మండల కేంద్రాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఏజెన్సీలో పలు ప్రాంతాలకు బయటి ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. వెంకటాపురం మండలంలో పెంకవాగు ప్రమాదకర స్థాయిలో ఉప్పొంగి ప్రవహిస్తుంది. మోట్లగూడెం, ముత్తాపురం, గోనెపల్లి, వెంగళపూర్, ఇతర గ్రామాలు పూర్తిగా జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. భారీ వర్షాల కారణంగా మేడారం చేరుకునే మార్గంలోని అనేక వాగులు రహదారులపై నుంచి ప్రవహిస్తున్నాయి. మేడారం వద్ద జంపన్న వాగు గతంలో ఎన్నడూ లేని విధంగా ఉగ్రరూపం దాల్చింది. వాగుపై నిర్మించిన రెండు వంతెనలు నీట మునగగా, వాగు సమీప ప్రాంతాల్లోని గ్రామాల్లో నడుం లోతు నీరు నిలిచింది.

జంపన్నవాగు సమీపంలో పర్యాటకుల కోసం ప్రభుత్వం నిర్మించిన కాకతీయ హరిత హొటల్ కూడా జలదిగ్బంధంలో చిక్కుకుంది. గతంలో ఎప్పుడూ ఇంత స్థాయి వరదలు చూసిన సందర్భం లేదని స్థానికులు అంటున్నారు. మేడారం గుండా ప్రవహించే జంపన్న వాగు నదిని తలపిస్తుంది. రానున్న రోజుల్లో భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణశాఖ వెల్లడించిన నేపథ్యంలో మున్ముందు పరిస్థితి ఎలా ఉంటుందోనన్న భయంలో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం భారీ వరదల దృష్ట్యా పరిసర ప్రాంతాలలోని ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు.

భారీ వరదల నేపథ్యంలో మేడారంవచ్చే భక్తులకు స్థానిక పర్యాటకశాఖ అధికారులు సూచనలు జారీ చేశారు. వర్షాలు తగ్గిన తర్వాత మేడారం వచ్చేలా ప్రణాళికలు చేసుకోవాలని ఆలయ అధికారులు చెప్తున్నారు. మేడారం సమ్మక్క సారక్క ఆలయం వద్ద మొక్కులు చెల్లించడానికి సుదూర ప్రాంతాల నుంచి భక్తులు వస్తుంటారు. ప్రస్తుత వరదల కారణంగా ప్రయాణం ప్రమాదకరంగానూ, ఇబ్బందికరంగానూ ఉంటుందని కాబట్టి భక్తులు తమ ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని అధికారులు చెప్తున్నారు. మరోవైపు భారీ వరదల కారణంగా ములుగు జిల్లా వ్యాప్తంగా పత్తి, వారి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పంటలు పూర్తిగా దెబ్బ తిన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కడెం ప్రాజెక్టుకు ముప్పు తప్పింది. వరద ప్రవాహం కాస్త తగ్గింది. బుధవారం భారీగా వచ్చిన వరదతో చెత్త, చెట్లు ప్రాజెక్టులోకి కొట్టుకొచ్చాయి. గేట్లలో, ప్రాజెక్టుపై భారీగా చెత్త పేరుకుపోయింది. గేట్ల గేర్ల మధ్యలోనూ... చెట్లు ఇరుక్కున్నాయి. ప్రాజెక్టు పలు గేట్లు డ్యామేజ్ అయ్యాయి. ప్రస్తుతానికి ఇన్ ఫ్లో తగ్గిందని.. ప్రాజెక్టుకు ముప్పులేదని అధికారులు చెప్పారు. ప్రాజెక్టుకు వరద తగ్గినప్పటికీ కడెంతో పాటు పలు గ్రామాలు... జల దిగ్బంధంలోనే ఉన్నాయి. సహాయం కోసం ముంపు గ్రామాల ప్రజలు ఎదురుచూస్తున్నారు. మొత్తంగా కడెం ప్రాజెక్ట్‌కు పెను ప్రమాదం నుంచి బయటపడింది. ప్రస్తుతానికి ప్రమాదం ఏం లేదని చెబుతున్నారు. అలాగే ప్రాజెక్టుకు వచ్చే ఇన్‌ఫ్లో కాస్త తగ్గుముఖం పట్టిందని, ఇంకా తగ్గితే ప్రమాదం తప్పినట్టేనని కలెక్టర్ ప్రకటించారు. అయితే వానలు పడుతూనే ఉండటం, మరింత పెరగొచ్చనే వాతావరణ శాఖ సూచనలతో ఎప్పుడేం జరుగుతుందోనన్న భయం వ్యక్తమవుతోంది. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 2.5 లక్షల క్యూసెక్కుల ఇన్ ఫ్లో ఉండగా.. అవుట్ ఫ్లో 2 .5 లక్షల క్యూసెక్కులుగా ఉంది. 17 గేట్లను ఎత్తి అధికారులు నీటిని కిందకు వదులుతున్నారు.

కొన్ని రోజులుగా ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో కడెం ప్రాజెక్టుకు రికార్డుస్థాయిలో వరద వస్తోంది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలతో గతంలో ఎన్నడూ లేనివిధంగా 64 ఏళ్ల రికార్డును బద్దలు చేస్తూ వరదనీరు వచ్చి చేరింది. వరద నీరు తీవ్రంగా పోటెత్తుతుండటంతో ప్రాజెక్ట్‌లో నీటిమట్టం ప్రమాద స్థాయిలో ఉందని అధికారులు ప్రకటించారు. ఎగువన మహారాష్ట్రలో భారీ వర్షాలు పడటంతో అక్కడి నుంచి వాగుల్లో భారీ వరద మొదలైంది. దానికితోడు మంగళవారం సాయంత్రం నుంచి నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల్లోని అటవీ ప్రాంతాల్లో కురిసిన వాన నీళ్లు కడెం వైపు పరుగులు తీస్తూ వచ్చాయి. మహారాష్ట్రలోని వాగుల సమాచారం తెలియకపోవడం, అటవీ ప్రాంతాల నుంచి వచ్చే ప్రవాహాల స్థాయి తెలిసే పరిస్థితి లేకపోవడంతో.. అధికారులు భారీ వరదను అంచనా వేయలేకపోయారు. ఒక్కసారిగా ఐదు లక్షల క్యూసెక్కుల వరద రావడంతో అవాక్కయ్యారు. అప్పటికప్పుడు మొత్తం 18 గేట్లలో 17 గేట్లను ఎత్తేశారు. ఒక గేటు మొరాయించడంతో వదిలేశారు. ప్రాజెక్ట్ పరివాహక ప్రాంతాల ప్రజలు ప్రాణాలను అరచేతిలో పట్టుకొని జీవించారు. అయితే



ప్రస్తుతం కడెం ప్రాజెక్టుకు ప్రమాదం లేదని తెలిసి ఊపిరిపీల్చుకున్నారు. జిల్లా వ్యాప్తంగా వారం రోజులుగా వర్షం కురుస్తోంది. ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. భారీ వర్షాలకు 30 గ్రామాలు జల దిగ్బంధంలో ఉన్నాయి. జిల్లాలో సుమారు 50కి పైగా ప్రాంతాల్లో రాకపోకలు నిలిచిపోయాయి. దాదాపు 27,802 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. 19,980 ఎకరాల్లో వరి, 5,251 ఎకరాల్లో సోయాబిన్, 2,383 ఎకరాల్లో మొక్కజొన్న, 188 ఎకరాల్లో పత్తి, 4,608 ఎకరాల్లో వరి నారుమడులు దెబ్బతిన్నట్లు నివేదికలు చెబుతున్నాయి. జిల్లాలో ఈ వర్షాలకు ఇప్పటి వరకు 417 ఇళ్లు పాక్షికంగా, 11 ఇళ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. 50కి పైగా రోడ్లపై నీళ్లు పారుతుండగా ఇప్పటి వరకు 16 రోడ్లు దెబ్బతిన్నట్లు అధికారులు ప్రభుత్వానికి నివేదిక అందజేశారు. జిల్లాలో మొత్తం 1067 చెరువులు ఉండగా 944 చెరువులు పూర్తిగా నిండి మత్తడులు పారుతున్నాయి. ఇప్పటి వరకు 150 వరకు పోల్స్, 18 ట్రాన్స్‌ఫార్మర్‌లు దెబ్బతిన్నట్లు ట్రాన్స్‌కో అధికారులు వెల్లడించారు. మొత్తంగా ఎడతెరపి లేకుండా కుర్తున్న భారీ వర్షాలకు జిల్లా విలవిలలాడుతోంది. జిల్లాలోని వాగులు పొంగుతున్నాయి. మంజీరా, గోదావరి నదులు పోటెత్తుతున్నాయి. భారీ వర్షాలకు నగరంతో పాటు పలు మండల్లాలోని సుమారు 30 గ్రామాలు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. గోదావరి తీర ప్రాంత ప్రజలు భయంలో గుప్పిట్లో గడుపుతున్నారు. వర్ని మండలంలోని తగిలేపల్లి గ్రామంలో బుధవారం రాత్రి గోడకూలి నిద్రిస్తున్న రాజమణిపై పడడంతో మృతిచెందింది. పలుచోట్ల రహదారులు కోతకు గురవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో చాలా గ్రామాలకు బాహ్య ప్రపంచానికి సంబంధాలు తెగిపోయాయి. అనేకచోట్ల చెరువులకు గండ్లు, కూలిన ఇళ్లతో భారీ నష్టం వాటిల్లింది. జిల్లా వ్యాప్తంగా 27802 ఎకరాల్లో పంటలు నీటమునిగాయి. జిల్లాలో సుమారు 50కి పైగా ప్రాంతాల్లో రాకపోకలు నిలిచిపోయాయి. భారీగా వరద ప్రధాన రహదారుల నుంచి వెళ్తుండడంతో గంటల పాటు వాహనాలు నిలిచిపోయాయి. భారీ వర్షాలకు జిల్లాలో పలుచోట్ల చెరువులకు గండ్లు పడ్డాయి. జిల్లాలో పడుతున్న భారీ వర్షాలతో యంత్రాంగం అప్రమత్తమైంది. కలెక్టరేట్‌తో పాటు పలు కార్యాలయాల్లో ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు సహాయ చర్యలు చేపట్టారు. వరద నీరు చేరిన ప్రాంతాల వారిని పునరావాస ప్రాంతాలకు తరలించారు. జిల్లాలో 19980 ఎకరాల్లో వరి, 5251 ఎకరాల్లో సోయాబిన్, 2383 ఎకరాల్లో మొక్కజొన్న, 188 ఎకరాల్లో పత్తి దెబ్బతిన్నట్లు వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. ఇవే కాకుండా నారుమడులు 4608 ఎకరాల్లో దెబ్బతిన్నట్లు నివేదికలో పేర్కొన్నారు. ఈ పంటలే కాకుండ వేలాది ఎకరాల్లో పంటలు నీటిలో మునిగాయని ప్రభుత్వానికి పంపిన నివేదికలో వ్యవసాయ అదికారులు పేర్కొన్నారు. జిల్లాలో ఈ వర్షాలకు ఇప్పటి వరకు 417 ఇళ్లు పాక్షికంగా, 11ఇళ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. జిల్లాలో 50కి పైగా రోడ్లపై నీళ్లు పారుతుండగా ఇప్పటి వరకు 16రోడ్లు దెబ్బతిన్నట్లు అధికారులు ప్రభుత్వానికి పంపించిన నివేదికలో పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 1067 చెరువులు ఉండగా 944 చెరువులు పూర్తిగా నిండి మత్తడులు పారుతున్నాయి. జిల్లాలో మిగతా చెరువులు నిండుకుండలా మారాయి. గడిచిన వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న అతి భారీ వర్షాలకు నిజామాబాద్ జిల్లా అతలాకుతలమైంది. భారీ వర్షాలతో పంటలు దెబ్బతిన్నాయి. వరిపొలాలు నీట మునిగాయి. జిల్లా వ్యాప్తంగా 25 వేల 869 మంది రైతులకు చెందిన 49వేల 591 ఎకరాల పంట నష్టం సంభవించినట్టు వ్యవసాయ శాఖ పేర్కొంది. సోయా, పత్తి, వరి పంటలు అత్యధికంగా వరదల్లో మునిగిపోయినట్లు అధికారులు వెల్లడించారు. వ్యవసాయ భూముల్లో వరద నిలిచి ఉండడంతో పంట నష్టం వివరాల గణన ఇంకా కొనసాగుతూ ఉందని అధికారులు చెప్పారు.

భారీ వర్షాలకు పలుచోట్ల చెట్లు పడిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. నగరంతో పాటు ఇతర ప్రాంతాల్లో కూడా అంతరాయం ఏర్పడడంతో వాటిని తీసివేసి విద్యుత్ పునరుద్ధరించారు. భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉండడం వల్ల జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ నారాయణరెడ్డి విజ్ఞప్తి చేశారు. ప్రజలు అవసరమైతే తప్ప ఇళ్లనుంచి బయటకి రావద్దని కోరారు. లోతట్టు ప్రాంతాలు, వరద నీరు ప్రవహిస్తున్న ప్రాంతాల నుంచి రాకపోకలను నిషేధించాలని అవసరమైతే పోలీసుల సహకారం తీసుకోవాలన్నారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో ఉంటున్న వారిని పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆయన సూచించారు. వాగులు, వంకల్లో వరద ఉరకలెత్తుతున్నది. చెరువులు, చెక్‌డ్యామ్‌లు మత్తళ్లు దుంకుతున్నాయి. జిల్లాలోని పుల్కాల్ మండలం బాగారెడ్డి సింగూర్ ప్రాజెక్టులో నీటి నిల్వ పెరుగుతోంది. ఎగువ ప్రాంతమైన కర్ణాటక, మహారాష్ట్ర నుండి సింగూర్ ప్రాజెక్టుకు వరద నీటి ప్రవాహం కొనసాగుతోంది. ప్రస్తుతం ప్రాజెక్ట్ ఇన్ ఫ్లో 15 వేల 955 క్యూసెక్కులుగా కొనసాగుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 29.917 టీఎంసీలు కాగా... ప్రస్తుతం నీటి నిల్వ 22.417 టీఎంసీలుగా ఉంది. ప్రాజెక్టు నుండి దిగువకు నీటి ఔట్ ఫ్లో నిల్‌గా ఉంది. మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో ఎడతెరిపి లేకుండా వాన కురుస్తూనే ఉన్నది. వర్షానికి సంగారెడ్డి జిల్లాలోని సింగూరు, నారింజ, మంజీర, నల్లవాగు ప్రాజెక్టులు జలకళ సంతరించుకున్నాయి. మెదక్ జిల్లాలో వనదుర్గా, పోచారం ప్రాజెక్టుల్లో వరద పరవళ్లు తొక్కుతున్నది. మంజీర నది, హల్దీ వాగుల్లో వరద ప్రవాహం కొనసాగుతున్నది. చెరువులు, చెక్‌డ్యామ్‌లు నిండుతున్నాయి. వర్షాలకు అనేక గ్రామాల్లో శిథిల ఇండ్లు కూలిపోయాయి. మంజీర తీర ప్రాంతంలో పంటలు నీటమునిగాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సహాయ చర్యలు చేపడుతున్నారు. అల్పపీడనం కారణంగా ఐదారు రోజుల నుంచి కురుస్తున్న వర్షం ఇప్పుడిప్పుడే తెరిపినిస్తోంది. ఎగువ ప్రాంతాల నుంచి వరద ప్రవాహం ఉధృతంగా ప్రవహిస్తుండడంతో మెదక్, సంగారెడ్డి జిల్లాల్లోని జలవనరులు పొంగిపొర్లుతున్నాయి. ప్రాజెక్టులకు జలకళ సంతరించుకుంటుండగా, చెక్‌డ్యామ్‌లు మత్తళ్లు దుంకుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో రైతులు పంటపొలాల్లో పనులు చేసుకుంటుండగా, పలుచోట్ల పంట చేలల్లోకి వాననీరు చేరింది. ఆయా జిల్లాల్లోని పలుచోట్ల రోడ్లు దెబ్బతినగా, ఇండ్లు, చెట్లు కూలాయి. అల్పపీడనానికి తోడు నైరుతి రుతుపవనాల రాకతో మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో వర్షాలు పుష్కలంగా పడ్డాయి. నీటిపారుదల శాఖ అధికారులతో కలిసి జిల్లాలోని ప్రాజెక్టులు, చెరువులను కలెక్టర్ శరత్ పరిశీలించారు. జిల్లాలోని పోచారం డ్యామ్, ఘనపూర్ ప్రాజెక్టులు పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరుకున్నాయి. ఇప్పటికే పోచారం డ్యామ్ పొంగిపొర్లుతున్నది. ఘనపూర్ ప్రాజెక్టు కూడా పొంగిపొర్లుతుండడంతో ఏడుపాయల వనదుర్గా మాత ఆలయం ఎదుట నుంచి నీటి ప్రవాహం ఎక్కువైంది. అంతేకాకుండా జిల్లాలోని ఆయా మండలాల్లోని చెరువులు, కుంటలు అలుగులు పారుతున్నాయి.రెండు రోజులు వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. ఎగువనుంచి సింగూరు ప్రాజెక్టులోకి వరద వచ్చి చేరుతుండడంతో ప్రాజెక్టుకు జలకళ సంతరించుకున్నది. మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలంలోని సోమన్ పల్లి వద్ద గోదావరి నదిలో చిక్కుకున్న ఇద్దరిని హెలికాప్టర్ ద్వారా రక్షించారు. మేకలను కాసేందుకు వెళ్లిన కాపరులు వెనక్కి వచ్చే సమయానికి వరద ముంచెత్తింది. దీంతో వారు వాటర్ ట్యాంక్ ఎక్కి, సహాయం కోసం ఎదురు చూస్తున్నారు. వరద ఉధ్ధృతి తీవ్రం కావడం తో ఎవరు వారిని కాపాడే సాహసం చేయలేకపోయారు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్ చెన్నూరు ఎమ్మెల్యే బాల్క సుమన్ వారిని కాపాడేందుకు మంత్రి కేటీఆర్ తో మాట్లాడారు. వెంటనే అప్రమత్తమై హుటాహుటిన హెలికాప్టర్ ను తెప్పించి ఇద్దరినీ సురక్షితంగా బయటకు తరలించారు. భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ఎమ్మెల్యే సహాయక చర్యలను స్వయంగా పర్యవేక్షించారు. మరోవైపు.. మంచిర్యాల జలదిగ్బంధంలో చిక్కుకుంది. ఎగువ నుంచి శ్రీరామ్‌సాగర్, ఆపై ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నుంచి భారీగా వరద వస్తోంది. ఎల్లంపల్లి ప్రాజెక్ట్ 54 గేట్లు ఎత్తివేయడంతో మంచిర్యాలలోని కాలనీల్లోకి వరద చేరింది. రాళ్లవాగు ప్రవాహంతో మంచిర్యాలకు వరద ముప్పు పెరుగుతోంది. మంచిర్యాలలోని ఎన్టీఆర్ కాలనీ, ఎల్ఐసీ కాలనీ, రామ్‌నగర్, పద్మశాలీవాడతో పాటు పలు కాలనీల్లోకి చేరింది. గోదావరి బ్రిడ్జిపై నుంచి వరద నీరు పోటెత్తడంతో కరీంనగర్, మంచిర్యాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి.రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరించింది. ఎనిమిది జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, పెద్దపల్లి, మంచిర్యాల, భూపాలపల్లి, ములుగు జిల్లాలో అతిభారీ వర్షాలు కురుస్తాయని చెప్పిన వాతావరణశాఖ.. ఈ మేరకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. అలాగే పలు జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. మరో వైపు రాష్ట్రవ్యాప్తంగా రాబోయే ఐదు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఇదిలా ఉండగా.. ఇవాళ ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, ములుగు, కరీంనగర్, నిజామాబాద్, నిర్మల్‌లో మోస్తరు వర్షాలు కురిశాయి.

# పంప్‌హౌస్‌లోకి వరద

మొదటిపేజీ తరువాయి..

విమర్శించారు. కేసీఆర్ నిర్వాకం వల్లే రూ.వేల కోట్లు వృథా కావడమే కాకుండా, మంథని, ధర్మపురి నియోజకవర్గాలు పూర్తిగా నీటమునిగిపోయాయన్నారు. రూ.వందల కోట్లతో కొత్తగా నిర్మించిన సిరిసిల్ల, జనగాం జిల్లా కలెక్టరేట్ భవనాలు సైతం నీటమునిగి, గోడలు నెర్రెలు వేయడం దారుణమన్నారు. ప్రపంచంలోనే గొప్ప నిర్మాణమని ప్రచారం చేసుకున్న యాదాద్రి ఆలయ నిర్మాణాలు సైతం కుంగిపోతుండటం సిగ్గు చేటన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్లక్ష్యం వల్లే ఇపుడు తెలంగాణ గోదావరి పరివాహక ప్రాంతం పూర్తిగా మునిగిందంటూ ఢిల్లీలో తీవ్ర ఆరోపణలు చేశారు ఆ రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి. కరీంనగర్, నిజామాబాద్, వరంగల్, ఆదిలాబాద్ వరద బాధిత జిల్లాల్లోని 20 నియోజకవర్గాల్లో ముంపు ప్రభావం తీవ్రంగా ఉందన్నారు రేవంత్ రెడ్డి. సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల పర్యవేక్షణలో నిఘా, పరిశీలన ఎక్కడా జరగలేదన్నారు. రెవెన్యూ, పంచాయతీ, వైద్య శాఖలను ప్రభుత్వం సమన్వయం చేయలేదన్నారు. ఆదిలాబాద్ నుంచి.. ఖమ్మం జిల్లా వరకు గోదావరి పరివాహక ప్రాంతం అంతా మునిగిపోయిందని ఫైరయ్యారు పీసీసీ చీఫ్. వరదల్లో అత్యంత పెద్ద ప్రమాదం కాళేశ్వరం ప్రాజెక్టుకే వచ్చిందన్నారు రేవంత్ రెడ్డి. మూడో టీఎంసీ సంగతి దేవుడెరుగు.. ఇంకో మూడు నాలుగేళ్లు కాళేశ్వరం నుంచి నీళ్లు ఎత్తలేని పరిస్థితి వచ్చిందని చెప్పారు. మొత్తం లిఫ్టులు, పంపులు ఎక్కడికక్కడ నీళ్లలో మునిగి జలమయమైపోయాయన్నారు.

రూ.38వేల కోట్లతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును గతంలో సంకల్పించిందన్నారు రేవంత్. దీనిని రీడిజైనింగుల పేరు మీద కేసీఆర్ రూ.లక్షనలభై వేల కోట్లకు పెంచారని ఆరోపించారు.

ఇందులో లక్ష కోట్ల అవినీతి జరిగిందనీ.. మరో లక్ష కోట్ల దాకా ఖర్చు పెట్టదలిచారన్నారు. ఇంతా చేస్తే.. కాళేశ్వరం ఇవాళ నిండుగ నీట మునిగిపోయిందన్నారు రేవంత్ రెడ్డి. కాళేశ్వరం మునిగిపోవడానికి ఆరోపించారు రేవంత్ రెడ్డి. కేసీఆర్ తన అవినీతిని కప్పిపుచ్చుకునేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. అవినీతిని కేసీఆర్ కవర్ చేసుకున్నారు కానీ.. నీళ్లలో మునిగిన కాళేశ్వరం ప్రాజెక్టును కేసీఆర్ ఎలా కాపాడతారో చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. అందుకే నీళ్లలో మునిగిన కాళేశ్వరం వీడియోలు అందుకే మీడియాకు పంపించానన్నారు రేవంత్. ఐతే.. ఏ మీడియా ఛానెల్(వీ6 తప్ప) కూడా వాటిని పెద్దగా వినియోగించినట్టు



కనిపించలేదన్నారు. ఇప్పటికైనా కేసీఆర్ మందు మత్తు వదిలి, రాజకీయ విభేదాలు పక్కన పెట్టి వెంటనే వరద సహాయక చర్యలు ప్రారంభించాలని రేవంత్ కోరారు. రాష్ట్ర స్థాయిలో సమీక్ష చేయడానికి ఓ వ్యవస్థను ఏర్పాటుచేయాలని కోరారు. 12 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగిందన్నారు. కేంద్రానికి లేఖలు రాసి సహాయం పొందాలని సూచించారు. రేపు ప్రధాని ఆఫీస్, డిజాస్టర్ మేనేజ్ మెంట్ కు కాంగ్రెస్ తరఫున రిప్రెజెంటేషన్ ఇస్తామన్నారు.

కేసీఆర్ అవినీతి, డిజైన్ల లోపం, నిర్లక్ష్యమే కారణమన్నారు రేవంత్ రెడ్డి. అనుభవం లేని ప్రతిమ లాంటి కంపెనీలకు వేలకోట్ల రూపాయల పనులు అప్పజెప్పడంతో... ఎలా పడితే అలా నిర్మించేశారని ఆరోపించారు. ఓ మాదిరిగా వర్షాలొస్తేనే కాళేశ్వరం కుప్పకూలిపోయిందన్న రేవంత్.. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు కేసీఆర్ అవినీతికి బలి అయిపోయిందని ఓ రేంజ్ లో ఫైరయ్యారు. చుట్టూ పోలీసులను పెట్టి.. కాళేశ్వరానికి ఎవరినీ వెళ్లకుండా నియంత్రిస్తున్నారని

# ఇద్దరు పిల్లల పాలసీకి వ్యతిరేకం

## చైనా చేసిన తప్పును మనం చేయరాదన్న ఓవైసీ

హైదరాబాద్,జూలై14: కుటుంబ నియంత్రణకు తాను బద్ద వ్యతిరేకినని, ఇద్దరు పిల్లల పాలసీకి తాను వ్యతిరేకమని ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ తెలిపారు. ఇద్దరు పిల్లల పాలసీ దేశానికి ఏమాత్రం ఉపయోగకరం కాదని అయన అభిప్రాయపడ్డారు. ఈ మేరకు ఆయన ట్వీట్ చేశారు. చైనా చేసిన తప్పును భారత్ చేయకూడదని హెచ్చరించారు. దేశంలో ఫెర్టిలిటీ రేట్ తగ్గిపోతోందని, 2030 వరకు ఇది స్థిరీకరించబడుతుందని పేర్కొన్నారు. ఇక అన్ పార్లమెంటరీ పదాల ఇష్యూపై అసదుద్దీన్ స్పందించారు. పార్లమెంట్‌లో మాట్లాడేటప్పుడు ఏ విషయంపై మాట్లాడుతున్నామనేది చాలా ముఖ్యమని ఆయన అన్నారు. అంతేగానీ ఫలానా పదాలు అసభ్య పదాలు అని ఎలా అంటారని ప్రశ్నించారు. కొత్త పార్లమెంట్ భవనంపై జాతీయ చిహ్నాన్ని ఆవిష్కరిస్తున్న సమయంలో పీఎం మోడీ వెనుక లోక్ సభ స్పీకర్ కూర్చోడాన్ని అన్ పార్లమెంటరీ కాదా అని ప్రశ్నించారు.

# పరిస్థితి అదుపులోనే ఉంది

మొదటిపేజీ తరువాయి..

జిల్లాలపై మరింత అప్రమత్తంగా ఉన్నామని పేర్కొన్నారు. ముంపు బాధితుల కోసం రాష్ట్రంలో 223 ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ప్రాణనష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సీఎస్ సోమేశ్ కుమార్ సూచించారు. రాబోయే రోజుల్లో భారీ వర్షాలున్నాయని వాతావరణశాఖ హెచ్చరించిందని, భద్రాచలం దగ్గర గోదావరి రేపటికి 70 అడుగులకు చేరే అవకాశం ఉందని ఆయన తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలందర్నీ ఖాళీ చేయించాలన్నారు. వరదబాధితులను సహాయక కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. ఇదిలా ఉంటే.. ప్రధాన రహదారి, బ్రిడ్జి ని పూర్తిగా తమ అధీనం లోకి తీసుకున్నామని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏఎస్పీ రోహిత్ వెల్లడించారు. ఎమర్జెన్సీ అయితే తప్ప ఎవరిని పంపించటం లేదని స్పష్టం చేశారు. రాత్రికి సుమారుగా 70 అడుగుల వరకు వరద ఉధృతి పెరుగుతుంది అని అంచనా వేశారు. ఎట్టి పరిస్థితులలో ఎవరు ప్రయాణాలు పెట్టుకోవద్దని, బయటికి రావొద్దని ఆయన ప్రజలకు సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను తరలించమని ఆయన వెల్లడించారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో పూర్తి స్థాయిలో పర్య వేక్షిస్తున్నామని, ప్రజలు ఎవరు భయభ్రాంతులకు గురి కావొద్దని ఆయన వెల్లడించారు.



# కుటుంబ పాలనతో రాష్ట్రం అధోగతి

## కేంద్రనిధులు పక్కదారి పట్టించిన కేసీఆర్

## రాజ్యసభసభ్యుడు లక్ష్మణ్ విమర్శలు

హైదరాబాద్,జూలై14: కేంద్ర ప్రభుత్వ నిధులను టీఆర్ఎస్ ప్రభుత్వం పక్కదారి పట్టిస్తోందని బీజేపీ సీనియర్ నేత, రాజ్యసభ సభ్యులు లక్ష్మణ్ ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వం అవినీతితో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కుదేలైందన్నారు. ఉత్తరప్రదేశ్ నుంచి తాను రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైనప్పటికీ తెలంగాణ రాష్ట్ర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని స్పష్టం చేశారు. రాజ్యసభలో తెలంగాణ గొంతుకను వినిపిస్తానని అన్నారు. రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్ ఏర్పాటే లక్ష్యంగా పని చేస్తామని చెప్పారు. ప్రధాని మోడీ ఆకాంక్ష అయిన డబుల్ ఇంజన్ సర్కారు రావడం ఖాయమన్నారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి పాలనపై సీఎం కేసీఆర్ వ్యంగంగా మాట్లాడుతున్నారంటూ రాజ్యసభ సభ్యులు లక్ష్మణ్ మండిపడ్డారు. కుటుంబ పాలనకు తావు లేకుండా అర్హులందరికీ అన్ని రకాల సంక్షేమ పథకాలు అందించే పాలన డబుల్ ఇంజన్ సర్కారుదే అన్నారు. రాష్ట్రంలో ప్రజల ఆకాంక్ష మేరకు పాలన సాగడం లేదని, కుటుంబ పాలన కొనసాగుతుందోని మండిపడ్డారు. ఏ కారణాలతో విభజన హామీలు అమలు కాలేదో రాష్ట్ర ప్రజలకు అన్నీ తెలుసన్నారు. విభజన హామీల అమలుకు ప్రయత్నిస్తానని కూడా రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ అన్నారు. రాజ్యసభలో తెలంగాణ గొంతుకను వినిపిస్తానని స్పష్టం చేశారు. ఏ కారణాలతో విభజన హామీలు అమలు కాలేదో రాష్ట్ర ప్రజలకు తెలుసునని అన్నారు. కేంద్రం ఇస్తున్న నిధులను రాష్ట్ర ప్రభుత్వం ఒక్కదారి పట్టిస్తోందని, టీఆర్ఎస్సర్కార్ అవినీతితో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అదోగతి పాలైందని విమర్శించారు. తాను తెలంగాణలో కుటుంబ పాలన సాగుతోందని, రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్ ఏర్పాటే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. టీఆర్ఎస్‌లో అనేక మంది ఎమ్మెల్యేలు, నేతలు అయిష్టంగా కొనసాగుతున్నారని లక్ష్మణ్ పేర్కొన్నారు.



గోవాలో ఎన్‌డిఏ రాష్ట్రపతి అభ్యర్థి ద్రౌపది ముర్మును కలిసిన తెలంగాణ బిజెపి ఎమ్మెల్యేలు ఈటల రాజేందర్, రాజా సింగ్, రఘునందన్ రావు

## ధర్మపురిలో వర్ష బాధితులకు రూ. 5,000 తక్షణ సహాయం

**ధర్మపురి జులై 14 (ప్రజామంటలు):** మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆదేశాల మేరకు



భారీగా కురుస్తున్న వర్షాలకు ఇల్లు కూలిపోయిన నిరుపేదలకు ప్రభుత్వం తరపున తక్షణ ఆర్థిక సహాయం కింద రూ. 5, 000 అందచేసిన డీసీఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ సంగి సత్యమ్మ, తహసీల్దార్ వెంకటేష్, వైస్ చైర్మన్ రామన్న, మార్కెట్ వైస్ చైర్మన్ సునీల్, కౌన్సిలర్ వేణు పాల్గొన్నారు.



రాష్ట్ర విద్యా శాఖ మంత్రి సబిత ఇంద్రారెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసిన మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 4వ వార్డ్ కార్పేటర్ సిద్దాల పద్మ అంజయ్య, తెరాస అధికార ప్రతినిధి బండి నగేశ్, సిదాల ఆగమయ్య, ఇంద్రసేనా రెడ్డి, బండి నరసింహ, 42 వ డివిజన్ ప్రసిడెంట్, బండి భాస్కర్ లు

## వరద బాధితులను పరామర్శించిన మంత్రి పువ్వాడ అజయ్

**భద్రాచలం జూలై 14 (ప్రజామంటలు):** భద్రాచలం లోని సారపాక బిపిఎల్



పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలోని వరద ముంపు బాధితులను రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ కలిసి ధైర్యం కల్పించారు. మీకు ఎలాంటి ఇబ్బంది లేదని రెండు రోజులు ఓపికగా ఉండాలని సూచించారు. అక్కడే ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సందర్శించి మందుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అవసరమైన మందులు ఏమైనా కావాలంటే తక్షణమే జిల్లా వైద్యాధికారి సమాచారం ఇచ్చి వెంటనే తెప్పించుకోవాలని సూచించారు. వారి వెంట ప్రభుత్వ విప్ రేగ కాంతారావు, జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య, మాజి ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, తెల్లం వెంకట్రావు తదితరులు ఉన్నారు.



సంక్షేమ వసతి గృహాల్లో వర్షాలు కురిసిన నేపథ్యంలో జిల్లా వైద్యశాఖ అధికారులు, జిల్లా సంక్షేమ శాఖ అధికారులు మెడికల్ క్యాంపులు నిర్వహించాలని ప్రభుతాన్ని డిమాండ్ చేసిన ఎస్ఎఫ్ఐ జనగామ జిల్లా కార్యదర్శి ధర్మభిక్షం. జిల్లాలో ఉన్న పలు ఎస్సీ, ఎస్టీ, బిసి వసతి గృహాల సందర్శన.

# దత్తత గ్రామాలను పట్టించుకోని ఎమ్మెల్యే

**రఘునాథపల్లి జూలై 14 (ప్రజామంటలు):** ఎమ్మెల్యే మల్లంపల్లి గ్రామానికి వెళ్లి డబుల్ బెడ్ రూములు ఇస్తామని, గతంలో దత్తత గ్రామాలను అభివృద్ధి చేస్తామని చెప్పి ఇంతవరకు పిడికెడు మట్టి కూడా తీయలేదని రఘునాథపల్లి మండలంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోళ్ల రవి గౌడ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.... మల్లంపల్లి గ్రామానికి ఒక చరిత్ర ఉన్నదని, ఆ గ్రామాన్ని మోసం చేయకూడదని అన్నారు. గతంలో జనగామ నియోజకవర్గంలో ఉన్న మల్లంపల్లి గ్రామాన్ని మాజీ పిసిసి అధ్యక్షులు పొన్నాల లక్ష్మయ్య, కాంగ్రెస్ నాయకులు గ్రామానికి ప్రచార నిమిత్తం వెళ్ళినప్పుడు గ్రామంలో ఉన్న వ్యక్తుల ఇండ్లకు తాళాలు వేసి భీమండి, సోలాపూర్, బాంబే బతుకుదెరువు కోసం వెళ్లడం జరిగిందని తెలుసుకున్నారన్నారు. తదనంతరం జరిగిన ఎలక్షన్లలో పొన్నాల లక్ష్మయ్య గెలిచిన తర్వాత గ్రామ సమస్యను శాసనసభ దృష్టికి తీసుకువచ్చి పనికి ఆహార పథకానికి రూపకల్పన ఆనాడు జరిగిందని, ఆ గ్రామంలో మొత్తం దళితులే ఉన్నారని, ఇచ్చిన హామీ మేరకు ఆ గ్రామానికి ఇండ్లను మంజూరు చేయాలని లేనియెడల గాంధీ జయంతి రోజు అక్టోబర్ 2 తారీఖున ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ ముందు సత్యాగ్రహ దీక్ష చేపట్టడం జరుగుతుందని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎంపీటీసీ అల్లిబిల్లి కృష్ణ, మండల పార్టీ ఉపాధ్యక్షుడు గుగులోత్ కొమురెల్లి పేర్ని రవి, కురుమ శంకర్ నాయక్ పాల్గొన్నారు.



# ప్రశ్నకు ప్రమాదం

## (కవిత)

బ్లాక్ దందా ముసుగుల్లో బాబాలు
అందుకుంటున్నారు
పాలకులతో పాదాపి వందనాలు
కన్నెలు అమ్మలగన్న అమ్మలవుతుంటే
పేగుబంధం పెనెంపై నుండి
పొయ్యిలోకి జారుతోంది

ఉమ్మడి కుటుంబాల కమ్మదనం
పేదరాశి పెద్దమ్మ కథల వరసలో చేరింది
తినేతిండిలో పంచే ప్రేమలో
కరువవుతోంది కమ్మదనం

కార్పోరేట్ల లాభాల వలలో
కిడ్నీల గుట్టు
కడుపు నొప్పులన్నీ అపెండీసైట్ లే
పురిటి నొప్పులన్నీ సిజేరియన్లే

పరదేశపు విషకౌగిలి
కాస్మోటిక్స్ తో కాటేసింది
ప్రజాప్రతినిదులే ప్రశ్నలకు
ముడుపులందుకుంటుంటే
స్మశానంలో జననం
ఆసుపత్రుల్లో మరణం
అసైండ్ భూములన్నీ పక్కాపట్టాలు

పరిపాలనా పీఠం
అంగడి బొమ్మైతుంటే
మన ప్రజా సామ్యంలో
ఆదర్శాలకేం ఆకాశమంత
ప్రశ్నకు మాత్రం ప్రమాదం

రచన:
సాంబరాజు యాదగిరి
జనగామజి



పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలోని మర్రివాడ లో వరదనీటి లో చిక్కుకున్న మూడు నెలల చిన్న బాబును బుట్టలో పెట్టుకొని వెళ్తున్న దృశ్యం, అక్కడి పరిస్థితికి అద్దం పడుతోంది.



## సింగరేణి రేస్క్యూ టీం రాము, ఎన్టివి రిపోర్టర్ జమీర్ మృతి

- సంతాపం వ్యక్తం చేసిన హుజూరాబాద్ ఎమెల్యే


**హన్మకొండ జూలై 15 (ప్రజామంటలు):** హుజూరాబాద్ ఎమెల్యే ఈటెల రాజేందర్ వరదల్లో మృతి చెందిన వారికి తీవ్ర సంతాపం ప్రకటించారు. గర్భిణి ని కాపాడటానికి వెళ్లిన రాము హుజూరాబాద్ నియోజక వర్గం జమ్మికుంట మండలం మడిపల్లికి చెందిన వ్యక్తి అని, రాము కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నాం అని ఈటల తెలిపారు. రాము కుటుంబ సభ్యులను ఫోన్లో పరామర్శించారు. మరొక ఘటనలో ఎన్ టివి రిపోర్టర్ జమీర్ వరదనీటిలో కొట్టుకుపోవడం విచారకరం అని అన్నారు. విధుల్లో మృతి చెందిన వారి కుటుంబాలను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.



### పంట రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ

# బ్యాంకుల ఎదుట ధర్నాలు

**జనగామ జూలై 14 (ప్రజామంటలు):** పంట రుణాలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి భూక్య చందు నాయక్ ఆధ్వర్యంలో నెహ్రూ పార్క్ వద్ద ఉన్న ఎస్బిఐ, యూనియన్ బ్యాంక్, మున్సిపల్ ఆఫీస్ వద్ద ఉన్న ఎస్బిఐ బ్యాంకు ముందు ధర్నాలు నిర్వహించారు. వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని బ్యాంకు మేనేజర్లకు అందజేశారు. కౌలు రైతు సంఘం నాయకులు బూడిద గోపి ప్రభుత్వం ఏకమొత్తంలో మాఫీ చేయడంగానీ, రుణ మొత్తాన్ని ప్రభుత్వ ఖాతాలో వేసుకుని వాయిదాల ప్రకారం బ్యాంకులకు చెల్లించి, రైతులను రుణ విముక్తులను చేయాలన్నారు. రైతులకు పంట రుణాలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం నాయకులు సీనియర్ నాయకులు గురజాల లక్ష్మీనరసింహారెడ్డి, నర్సిరెడ్డి, పట్టణ కార్యదర్శి మంగ బీరయ్య, మంగ బీరయ్య, ఉర్సు కుమార్, మల్లారెడ్డి, అత్కురి ఎల్లయ్య, గాజుల నాగరాజు, కర్రే రాములు, కర్రె బీరయ్య, కోయల్ కార్ నాగరాజు, సాయి ప్రకాష్ శ్రీనివాస్, కాయితల మల్లేష్, లక్మయ్య, దేవరాయ శ్రీను, గాదేపాక దానమ్మ, మరబోన శివ బూడిద, సంపత్, బల్దే అంజయ్య, మద్దూరి మల్లయ్య, చీర నరసింహులు, కర్ర సత్తయ్య, కరే సిద్ది మల్లయ్య, కోయల్ కార్ సాయి ప్రకాష్, కోయల్ కార్ కన్నా, ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.



బిజెపి హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ ఆధ్వర్యంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షులు, ఎంపి బండి సంజయ్ కుమార్ సమక్షంలో బిజెపి లో చేరిన హన్మకొండ జిల్లా కాంగ్రెస్ నాయకురాలు కత్తుల కవిత - రాజేంద్ర ప్రసాద్ దంపతులు.



## నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలి

**జనగామ జూలై 14 (ప్రజామంటలు):** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు



వెంటనే నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలని జనగామ జిల్లా యూత్ కాంగ్రెస్ రివ్యూ మీటింగ్ స్థానిక జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బనుక శివరాజ్ యాదవ్ అధ్యక్షతన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జిల్లా యూత్ కాంగ్రెస్ సెక్రెటరీ ఇంఛార్జి హరీష్ వర్ధన్ పాల్గొని మాట్లాడుతూ అన్నారు. యూత్ కాంగ్రెస్ అధ్వర్యంలో పలు అంశాలపై పోరాటాలు చేయాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొరుకొప్పుల మధు గౌడ్, దాసరి క్రాంతి, స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ బస్వాగాని అనిల్, ఉపాధ్యక్షులు నీల యువరాజ్, తాటి రాజేందర్, జనగామ పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎండి ఆసిఫ్ (అషు), వివిధ మండలాల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు చిటకొరు సంపత్, గోల్లురి పృథ్వీ, జనగామ యూత్ కాంగ్రెస్ నాయకులు పిడుగు రమేష్, బంధరం క్రాంతి, రమగళ్ళ అభినయ్, సుంచు సురేష్, కొడేదల అజయ్, మెరేపల్లీ అఖిల్, ముదినేపల్లి నితిన్, గ్యారా క్రాంతి, ఎండీ ముబిన్, కండ్లకొల్ల కిషన్, కొన్నే నికేష్, చిటకోయిల హరీశ్, విక్రం పుల్ల, చాట్ల మధు, రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ టీవీ రిపోర్టర్ జమీర్ కుటుంబ సభ్యులను పరామర్శించిన మంత్రి, ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్పర్సన్

**జగిత్యాల జూలై 14 (ప్రజామంటలు):** జగిత్యాల జిల్లా రాయికల్ మండలం బోర్నపల్లి గ్రామాని కి చెందిన 9 మంది కూలీలు కాపాడే నిమిత్తం న్యూస్ కవరేజీ కి వెళ్ళిన జగిత్యాల జిల్లా కేంద్రానికి చెందిన



ఎన్ టీవీ రిపోర్టర్ జమీర్ రామోజీ పేట్ భూపతి పూర్ రోడ్డులో కారుతో సహా వరద ప్రమాదంలో గల్లంతు కాగా గురువారం జమీర్ కుటుంబ సభ్యులను పరామర్శించిన సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్, జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్, మున్సిపల్ చైర్పర్సన్ డా. భోగ శ్రావణి ప్రవీణ్.

## నిత్యావసర సరుకుల పంపిణీ చేసిన వోరగంటి యువసేన

**మానకొండూర్ జులై 14 (ప్రజామంటలు):** మానకొండూర్ నియోజకవర్గం ఇల్లంతకుంట మండలం అనంతారంలో గత వారం



రోజులుగా కురుస్తున్న వర్షాలకు జనజీవనం సతమతం అవుతున్న మన ప్రాంత ప్రజలను కాపాడుకోవాల్సిన బాధ్యత స్థానిక యువకులుగా మనపైన ఉన్నదని తెలంగాణ రాష్ట్ర ఆహార భద్రత కమీషన్ సభ్యులు వోరగంటి ఆనంద్ ఆదేశాల మేరకు వోరగంటి యువసేన ఆధ్వర్యంలో అనంతారం గ్రామంలో స్థానిక ఎస్‌సి కాలనీలో భారీ వర్షాలకు దెబ్బతిన్న ఇండ్లను పరిశీలించి వివిధ కుటుంబాలకు బియ్యం మరియు ఇతర నిత్యావసర సరుకులు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యులు బట్టి చంద్రమౌళి, స్థానిక వార్డు సభ్యులు మచ్చ ప్రభాకర్, ఒల్లాల రాజు, కోమటి రాజు, క్రాంతి, బడుగు సురేష్, మచ్చ రాజేశం, బట్టి భరత్, బట్టి నవీన్, వోరగంటి యువసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## లోతట్టు ప్రాంతాల్లో పర్యటించిన జిడబ్ల్యూఎంసీ కమిషనర్ ప్రావీణ్య

**హన్మకొండ జులై 15 (ప్రజామంటలు):** జిడబ్ల్యూఎంసి కమిషనర్ ప్రావీణ్య లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అధికారులను ఆదేశించారు. బుధవారం



జిడబ్ల్యూఎంసీ పరిధిలోని జంట నగరాలైన హన్మకొండ, వరంగల్ లోని లోతట్టు ప్రాంతాల్లో పర్యటించి వరద బాధితుల సమస్యలు విన్నారు. నాల్గవ డివిజన్ లోని పెద్దమ్మగడ్డ లోటస్ కాలనీలో, ఏనుమాముల మార్కెట్ సమీపంలోని చాకలి ఐలమ్మ నగర్ లోతట్టు ప్రాంతాలను కమిషనర్ క్షేత్రస్థాయిలో సందర్శించారు. లోటస్ కాలనీలో వరద నీటిని తక్షణమే హిటాచి యంత్రం సహాయంతో పారద్రోలాలని అన్నారు. వచ్చే రెండు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపినందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఒకవేళ అధిక వరద నీరు వచ్చినచో సమీపంలోని ఐకె గార్డెన్, పద్మాక్షి కమ్యూనిటీ హాల్ లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కమీషనర్ వెంట ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు శ్రీనివాస రావు, శ్రీనివాసరావు, ఏఈలు హరి, కృష్ణమూర్తి, తదితరులు ఉన్నారు.

# బిజెపి వ్యూహంతో విపక్షాల గిలగిల!

రాష్ట్రపతి ఎన్నికలకు ముహూర్తం దగ్గరపడుతున్న వేళ ద్రౌపది ముర్ము గెలుపు మరింత సునాయాసంగా మారింది. ఎన్‌డిఎ ఊహించిన దానికన్నా మిన్నగా పార్టీల మద్దతు దక్కడం, ఎన్‌డిఎలో కొత్త మిత్రుల చేరికకు సంకేతంగా చూడాలి. అటు సామాజిక మార్పు, ఇటు రాజకీయ బలం రెండూ సమకూరాలన్నది వ్యూహంగా కనిపిస్తోంది. అది సక్సెస్ కూడా అవుతున్న క్షణాలు చూడబోతున్నాం. ప్రస్తుత పార్టీల మద్దతు, ఎన్‌డిఎకు ఉన్న బలం చూస్తే..ద్రౌపది ముర్ము గెలుపు సునాయాసమే. ఈ రాష్ట్రపతి ఎన్నికల తరవాత ఎన్‌డిఎ కూటమి మరింత బలపడే సూచనలు కనిపిస్తున్నాయి. అలాగే విపక్షాల ఐక్యత అన్నది ప్రకటనలకే పరిమితం కాబోతున్నది. అతి పిన్నవయసు రాష్ట్రపతిగా ద్రౌపది అత్యున్నత పీఠంపై అధివసిస్తారు. 75 ఏళ్ళ స్వతంత్రభారతంలో తొలి ఆదివాసీ రాష్ట్రపతిగా, ప్రతిభా పాటిల్ తర్వాత రెండో మహిళా రాష్ట్రపతి గా రికార్డుకెక్కుతారు. చాన్నాళ్లకు దేశ అత్యున్నతపీఠం గిరిజనులకు దక్కడం స్వాగతించాల్సిన విషయం. రాజకీయ ఎత్తుగడగానైనా, సామాజిక మార్పు తెచ్చే నిర్ణయం తీసుకున్నందుకు ఎన్డీఏను అభినందించా ల్సిందే. ఇలాగే మహిళలకూ, గిరిజనులకూ పెద్దపీట వేయడాన్ని ఇతర రంగాల్లోనూ పాలకపక్షం కొనసా గించడం ద్వారా ప్రజల మన్ననలు పొందాలి. ఓడిషా నుంచి తొలిసారిగా అభ్యర్థిని నిలబెట్టడం, గిరిజన మహిళ కావడంతో అనూహ్యంగా బిజూ జనతా దళ్‌తో పాటు, జార్ఖండ్ ముక్తి మోర్చాలు బేషరతుగా మద్దతు పలికాయి. అలాగే అనూహ్యంగా శివసేన కూడా మద్దతు పలికింది. ఎన్‌డిఎ నుంచి విడివడ్డ శివసేన మళ్లీ దారికొస్తున్నట్లుగానే భావించాలి. ఈ దెబ్బతో మహారాష్ట్రలో విపక్షాల ఐక్యతను కూడా బిజెపి దెబ్బతీసింది. అక్కడ ఇక మహావికాస్ అఘాడి అన్నది మాయం కానుంది. కాంగ్రెస్‌కు చెందిన పలువురు ఎమ్మెల్యేలు ఇప్పటికే బిజెపికి టచ్‌లోకి వచ్చారని వార్తలు వస్తున్నాయి. ఇక ఎపిలో కూడా అధికార, విపక్ష పార్టీలు వైసిపి, టిడిపిలు మద్దతు పలకడం విశేషం. ఈ మధ్య టిడిపి అధినేత చంద్రబాబు మళ్లీ ఎన్‌డిఎకు దగ్గర అయ్యేందుకు యత్నాలు మొదలు పెట్టారు. గిరిజన మహిళను రాష్ట్రపతి అభ్యర్థిగా నిలబెట్టడంపై స్వాగతించారు. మద్దతు ప్రకటిం చారు. ప్రధాని మోడీని అభినందించారు. నిజానికి ఆయనంతగా ఆయనే ఎన్‌డిఎను వీడి కాంగ్రెస్ పంచన చేరి అందుకు భారీ మూల్యం చెల్లించు కున్నారు. రాజకీయాల్లో కూడా గెలవాలంటే వ్యూహం ముఖ్యం. ఆ సంగతి కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతాపార్టీకి తెలిసినంతగా విపక్షాలకు తెలియదన్నది తాజా పరిస్తితులను బట్టి తెలుసు కోవచ్చు. గతంలో ఉన్న బిజెపికి భిన్నంగా ఇప్పుడు బిజెపి నేతలు వేస్తున్న ఎత్తులు, పై ఎత్తులు చూస్తే అర్థం అవుతుంది. భారత రాష్ట్రపతి పీఠానికి తాజాగా అధికార, విపక్ష కూటములు తమ అభ్యర్థుల పేర్లను ప్రకటించిన తీరు చూస్తే బిజెపి ఎత్తులు వేసినట్లుగానే గమనించాలి. మమతా బెనర్జీముందుకు వచ్చి యశ్వంత్ సిన్హాను ప్రకటించే వరకు అభ్యర్థి ఎవరన్నది గుట్టుగా ఉంచి చివరకు తన భాగస్వామ్య పక్షాలతో కూడిన జాతీయ ప్రజాస్వామ్య కూటమి ఎన్డీఏ అభ్యర్థిగా గిరిజన మహిళ ద్రౌపదీ ముర్మూ పేరు బయట పెట్టింది. ఒక మహిళను, అందులోనూ ఆదివాసీని అభ్యర్థిగా ప్రకటించి విపక్షాలకు దిమ్మ తిరిగేలా చేయడంలో బిజెపి పైచేయి సాధించింది. ఈ క్రమంలో కొన్ని పార్టీలు అనివార్యంగా మద్దతు ప్రకటించక తప్పలేదు. అభ్యర్థి ఎంపికకే కష్టపడిన విపక్షాలు ముర్ముకు గట్టి పోటీని ఇస్తామన్న నమ్మకం మాత్రం కలిగించ లేకపోయాయి. కింది స్థాయి నుంచి పైకొచ్చిన ద్రౌపది ప్రస్థానం ఆసక్తికరం. ఒడిశాలో మారుమూల మయూర్ భంజ్ జిల్లాకు చెందిన ఆమె రాజకీయాల్లోకి రాక ముందు గిరిజన ఉద్యమకారిణిగా పేరుగడించారు. జార్ఖండ్



గవర్నర్‌గా పనిచేసిన నేపథ్యంలో ఈ సంథాల్ మహిళకు జెఎంఎం మద్దతు ప్రకటించింది. అంతేగాకుండా ఇప్పుడు మారిన సమీకరణాల్లో ఆ పార్టీ ఎన్‌డిఎలో చేరినా ఆశ్చర్యం లేదు. పైగా ఉత్తర,దక్షిణ భారతాల నుంచే రాష్ట్రపతులు ఎన్నికవుతూ వస్తున్న దేశంలో తూర్పు ప్రాంతం నుంచి గిరిజన మహిళను బరిలోకి దింపడం బీజేపీకి మాత్రమే చెల్లింది. ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్‌లలో దూరమైన ఆదివాసీ ఓటర్లను ఆకర్షించడానికీ, వచ్చే సార్వత్రిక ఎన్నికలకుదేశంలోని 10 కోట్ల గిరిజనుల ఓటుబ్యాంకును సుస్థిరం చేసుకోవడానికీ బీజేపీ పాచిక వేసిందనే చెప్పాలి. గత రాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్‌డిఎకు మద్దతు పలికిన టిఆర్ఎస్ ప్రస్తుతం ఎన్‌డిఎకు దూరం అయ్యింది. గుణాత్మక రాజకీయాలు అంటూ బయలుదేరిన కెసిఆర్ అనివార్యంగా విపక్షాల అభ్యర్థి యశ్వంత్ సిన్హాకు మద్దతు పలికారు. బిజెపిపై నోరు పారేసుకుంటున్న క్రమంలో కెసిఆర్‌కు మద్దతుగా దేశంలోని ఇతర పార్టీలు పెద్దగా అండగా నిలవకున్నా..కెసిఆర్ మాత్రం మమతా బెనర్జీ సూచించిన మాజీ బిజెపినేతకు మద్దతుగా నిలిచారు. ఇకపోతే ప్రస్తుత రాజకీయ పరిస్థితుల దృష్ట్యా ఎన్డీయే నిలబెట్టిన అభ్యర్థికి మద్దతు ఇవ్వడం ద్వారా శివసేన తన రాజకీయ చాతుర్యం చాటుకుంది. దెబ్బతిన్న దశలో మరింతగా దెబ్బతినకుండా ఓ అడుగు ముందుకు వేసిందనే చెప్పాలి. రాజకీయ విశ్లేషకులు మాత్రం ఉద్ధవ్ ఉదారతను ఓ రాజకీయ ఎత్తుగడగా,బీజేపీతో రాజీపడినట్టుగా భావిస్తున్నారు. పార్టీ ఎంపీలతో జరిపిన సమావేశంలో ద్రౌపదికి మద్దతు ఇవ్వాలని ఎక్కువ మంది కోరినట్టు వార్తలు వచ్చాయి. ఠాక్రేలను ప్రశ్నించ డమన్నది ఎరుగని పార్టీలో కొందరి సంతకాలతో ఓ ఎంపీ ఆయనకు లేఖ రాశాడు. ఎంపీలతో జరిపిన భేటీ ఉద్ధవ్‌కు దిశానిర్దేశం చేసిందనీ, ఆయన గీత దాటే అవకాశాలు లేవని తేలిపోయింది. సమావే శానికి హాజరైన ఎంపీలంతా ముక్తకంఠంతో ద్రౌపదికి మద్దతు ఇవ్వమని పట్టుబట్టారంటూ అందులో పాల్గొన్న ఓ ఎంపీ మీడియాకు చెప్పాడు. అందువల్ల ద్రౌపదికి మద్దతు ప్రకటించకపోతే శివసేన మరింత దెబ్బతిన గలదన్న నిర్ణయానికి ఉద్ధవ్ థాక్రే వచ్చారు. మహావికాస్ అగాఢీ లో ఉంటూనే యశ్వంత్ సిన్హాను కాదని ద్రౌపదిని సమర్థించడం ద్వారా పార్టీని కాపాడుకునే ప్రయత్నంతో పాటు, ఏక్‌నాథ్ షిండేతో మళ్లీ కలిసి పోయే అవకాశాలను మెరుగుపర్చుకున్నారు. అయితే శివసేన ఉనికినే దెబ్బతీసిన బీజేపీ కూటమికి ఠాక్రే మద్దతు ఎలా ఇచ్చారని కాంగ్రెస్ ప్రశ్నిస్తున్నప్పటికి ప్రస్తుతానికి అది సమస్యకాదు. పార్టీ ఎదుర్కొంటున్న తీవ్ర వ్యతిరేక పరిస్థితుల నేపథ్యంలోనే ఉద్ధవ్ ఈ నిర్ణయానికి వచ్చార న్నది వాస్తవం. ద్రౌపది ముర్ముకి మద్దతు ప్రకటించని పక్షంలో దీనిని సాకుగా చూపి ఎంపిలంతా ఎగిరి పోవచ్చు. కేవలం ఈ నిర్ణయంతో బీజేపీ దూకుడును నిలవరించలేకపోయినా, బీజేపీ, షిండే పక్షాలనుంచి కొనసాగు తున్న దాడిని కాస్తంత నిలువరించుకోవచ్చని ఉద్ధవ్ భావించి ఉంటారు. మొత్తంగా రాజకీయంగా బిజెపి మరింత బలపడిందనే చెప్పాలి. ఈ పరిణామాలు రానున్న ఎన్నికలకుముందు ఎన్‌డిఎను మరింత బలోపేతం చేసేవే అని భావించాలి. మొత్తంగా దేశంలో ఇప్పుడు సమీకరణాలు మారుతున్నాయి. కాంగ్రెస్ దాదాపు ఏకాకి అయ్యింది. ప్రజల్లో కూడా కుటుంబ రాజకీయాల పట్ల ఏవగింపు వస్తోంది. తెలంగాణలోననూ అదే పరిస్థితి కానవస్తోంది. రానున్నరోజుల్లో ఎన్‌డిఎ అనుసరించే వ్యూహాలకు విపక్షాల్లో ఐక్యత అన్నది మేడిపండు చందం కానుందనడంలో సందేహం లేదు.




## సాహితీ ప్రేమికులైన పాఠకులకు ప్రత్యేకం

" ప్రజా మంటలు" తెలంగాణ జాతీయ దినపత్రికలో రేపటి నుండి ప్రతి రోజు, " నేటి కథ" శీర్షికన ఒక కథను ప్రచురించనున్నామని తెలుపుటకు సంతోషిస్తున్నాం. రచయితలు తమ కథలను mantalukathalu@gmail.comకు పంపవచ్చు...

–ఎడిటర్.

# రాజుగారి కలలు

ఈ మధ్య అవంతిపుర రాజు శూరవర్మ " నేను రోజు కలలు కంటున్న " అంటూ రాజదర్బార్ లో తనకు వచ్చిన కలల గురించి తనే చెబుతూ ప్రజా సంక్షేమం వదిలేశాడు. అదృష్ట వశాత్తు అవంతి పురం బాగుంది అంటే గత రాజుల పాలనయే. ఈ యేడు వర్షాలు బాగా వచ్చాయి రైతులు అందరూ విత్తనాల కోసం

రోజు రాజు గారి దగ్గరకు వస్తుంటే రాజేమో కలల గురించి చెబుతూ ఉండేవాడు.ఇది రైతులకు బాధ కలిగించింది.మంత్రి వివేక సింహుడిని కలసి తమ గోడు వెల్లబొసుకున్నారు.

"అయ్య! ఈసారి వర్షాలు బాగా వచ్చాయి సరైన సమయంలో విత్తనం వేయకపోతే పంటలు పండవు. విత్తనాలు కోసం రాజు గారి దగ్గరకు వస్తే ఆయన కలల గురించి చెబుతున్నారు. మీరే మాకు దారి చూపాలి.మీ సహాయం కావాలి " అని అడిగారు. అందుకు వివేక సింహుడు " సరే నాకు కొంచెం సమయం ఇవ్వండి.మీకు న్యాయం జరుగుతుంది " అని చెప్పి పంపాడు.వివేకసింహుడు ఆలోచించి శూర వర్మకు తెలియకుండా అతని శయన మందిరం లో ఓ మూల నక్కాడు.

శూరవర్మ శయన మందిరంలో కి అడుగు పెడుతూ " ఈ రోజు నా కల ఏమిటంటే "నేను హంసతూలికా తల్పంపై ఈ లోకమంతా విహరించాను. ఈ కల విషయం దర్బార్ లో చెప్పాలి "అని గట్టిగా అన్నాడు. అది వివేకసింహుడి చెవిలో పడింది. వెంటనే అక్కడ నుంచి మెల్లిగా జారుకున్నాడు.

మరుసటి రోజు దర్బార్ కు అందరూ వచ్చారు. ఈ రోజు అయినా మా మనవి వింటాడేమో నని రైతులు ఆశగా వచ్చారు. శూరవర్మ వస్తూనే " నిన్న రాత్రి నేను ఓ కల గన్నాను. అయితే అది ఏమిటో మిరే చెప్పాలి "

అన్నాడు. ఆ మాటకు సభలో వారందరూ ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు.మహా మంత్రి వివేక సింహుడు లేచి "రాజా!నాకు కూడా ఓ కల వచ్చింది. ముందు నేను మీరు కన్న కల



ఏమిటో చెబుతా. తర్వాత నాకు వచ్చిన కల గురించి మీరు చెబుతారా! " అన్నాడు.

"అదేలా సాధ్యం మీకు ఏ కల వచ్చిందో మాకు ఎలా తెలుస్తుంది?" అన్నాడు. మహా మంత్రి చిన్నగా నవ్వి "మీకు వచ్చిన కల మేము చెప్పగా, మాకు వచ్చింది

మీరు చెప్పలేరా!అన్నాడు.

" చెప్పలేను కాని ఓ మాటిస్తాను. మీరు ఏది చెబితే అది చేస్తాను " అన్నాడు.

"సరే "అన్నాడు వివేక సింహుడు. మరుసటి రోజు "రాజా!నిన్న మీ కల ఏమిటంటే "మీరు హంసతూలికా తల్పంపై విహరిస్తూ, ఆహా!ఓహో అంటూ సంతోషంగా ఉన్నారు. అదే కదా " అన్నాడు.

రాజు ఆశ్చర్య పోయి "అదే,అదే " అన్నాడు. సభికులంతా చప్పట్లు చరిచారు. "మరి మా కోరిక తీరుస్తారా!"అన్నాడు వివేక సింహుడు.

"చెప్పండి "అన్నాడు రాజు సింహాసనం నుండి లేచి. వివేక సింహుడు రాజు చెవిలో ఏదో చెప్పాడు.

"అలాగే చేస్తాం "అన్నాడు రాజు. ఆ రోజు నుంచి రాజు గారు కలల గురించి ఎత్త లేదు. రాజు చెవిలో ఏమి చెప్పింది ఎవరికీ తెలియదు. మంత్రి ఏమి చెప్పాడో కాని ,రాజు పరిపాలన పై దృష్టి పెట్టాడు.రైతులకు విత్తనాలు అందించాడు. రైతులు మహా మంత్రి కి మనసులోనే కృత్ఞతలు చెప్పుకున్నారు.అవంతి పురం క్షేమంగా ఉంది.

–కనుమ ఎల్లారెడ్డి
93915 23027.

# ఇక మ్యూజియంగా వందేళ్లనాటి పార్లమెంట్ భవనం

## వర్షాకాల సమావేశాలతో పాభవనానికి ముగింపు
## శీతాకాల సమావేశాల్లో కొత్త పార్లమెంట్‌కు శ్రీకారం

న్యూఢిల్లీ,జూలై14 : బ్రిటిష్ పాలకుల కాలంలో నిర్మితమైన వందేళ్ల నాటి చరిత్రాత్మక పార్లమెంట్ భవనంలో చివరి పార్లమెంట్ సమావేశాలకు రంగం సిద్ధమైంది. ఈ నెల 18 నుంచి ఆగస్టు 12 వర కు ఇక్కడ పార్లమెంట్ వర్షాకాల



సమావేశాలు జరుగనున్నాయి. కొత్తగా నిర్మితమవుతున్న భవనంలో ఇక శీతాకాల పార్లమెట్ సమావేశాలు జరుగుతాయి. స్పీకర్ ఓం బిర్లా ఈ విషయాన్నిఇటీవలే చూచాయగా వెల్లడించారు. కొత్త భవనంపై భారత చిహ్నాన్ని ఇటీవలే ప్రధాని నరేంద్ర మోడీ ప్రతిష్ఠించారు కూడా. మొత్తంగా రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద, ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడులకు కూడా పాత పార్లమెంట్ భవనంతో అనుబంధం తీరనుంది. ఈ నెల 24 రాష్ట్రపతి పదవి నుంచి కోవింద్ దిగిపోనున్నారు. ఆగస్ట్ 10న ఉపరాష్ట్రపతిగా వెంకయ్యనాయుడు పదవీకాం ముగియనుంది. ఆగస్ట్ 13 వరకు పార్లమెంట్ సమావేశాలు జరగనున్నాయి. డిసెంబరులో జరిగే శీతాకాల సమావేశాలు సెంట్రల్ విస్తాలో భాగంగా మోదీ ప్రభుత్వం నిర్మిస్తున్న నూతన పార్లమెంట్ భవనంలోనే జరుగుతాయని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఇప్పటికే ప్రకటించారు. పాతభవనాన్ని లైబ్రరీగా లేదా మయూజియంగా మారుస్తారన్న ప్రచారం ఉంది. 17వ లోక్‌సభ 9వ సమావేశాలు, 257వ రాజ్యసభ సమావేశాలతో పాటు నూతన రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నిక పాత పార్లమెంట్ భవనంలోనే జరగనుంది. సమావేశాల తొలిరోజే రాష్ట్రపతి పదవికి, ఆగస్టు 6న ఉపరాష్ట్రపతి పదవికి ఎన్నికలు జరుగుతాయి. రాజ్యసభ చైర్మన్‌గా వెంకయ్యనాయుడు పదవీకాలం కూడా పాత పార్లమెంట్ భవనంలోనే ముగిసిపోనుంది. కాగా పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో ప్రభుత్వం ఆదివారం అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించనుంది. భారీ విధ్వంసక ఆయుధాల నిషేధిత చట్ట సవరణ బిల్లు, బాల్య వివాహాల నిషేధ చట్ట సవరణ బిల్లు, యాంటీ డోపింగ్ బిల్లు, వన్యప్రాణుల పరిరక్షణ చట్ట సవరణ బిల్లు, బయోలాజికల్ డైవర్సిటీ చట్ట సవరణ బిల్లులను గతంలో ప్రభుత్వం పార్లమెంటరీ స్థాయీ సంఘాల పరిశీలనకు పంపించింది.

కమిటీలు ఆ బిల్లులను పంపిస్తే వర్షాకాల సమావేశాల్లో వాటిని ఆమోదించే అవకాశం ఉంది. విద్యుత్తు పంపిణీలో అనేక ప్రైవేట్ కంపెనీలను ప్రవేశపెట్టే కీలకమైన విద్యుత్తు సవరణ బిల్లు, ప్రత్యేక అభివృద్ధి మండలాలకు మరింత ఆర్థిక కార్యకలాపాలు నిర్వహించే స్వేచ్ఛను కల్పిస్తున్న దేశ్ బిల్లులను ఈ సమావేశంలో ప్రవేశపెడుతున్నారు. అయితే విద్యుత్ పంపిణీ బిల్లు కార్పొరేట్లకే ప్రయోజనం కల్పిస్తుందని తృణమూల్‌తో సహా ప్రతిపక్ష పార్టీలు వ్యతిరేకిస్తున్నాయి. సైన్యంలో 75శాతం మందికి నాలుగేళ్లు మాత్రమే పనిచేసే అవకాశం కల్పించే అగ్నిపథ్‌నూ ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించేందుకు సిద్ధమవుతున్నాయి. అంతాగాకుండా సింహాల చిహ్నంలో మార్పులపైనా విపక్షాలు మండిపడుతున్నాయి. ఇవన్నీకూడా చర్చకు దారితీయవచ్చు.

# "ఆదర్శ దంపతులు స్నేహలతా ఈశ్వరులు"

(జూలై 15... మంత్రి ఈశ్వర్ వైవాహిక దినోత్సవ సందర్భంగా..)

వారు ఆదర్శ దంపతులు. ఒకరి మనసులో మాటను మరొకరు పరిపూర్ణంగా అర్థం చేసుకుని, చేదో డు వాదోడుగా అన్ని సందర్భాలలో అర్థత్వానికి అర్థం చెపుతూ, సాకారం కల్పిస్తున్నారు. ఎక్కడ ఆపద ఎదురైనా, ఇబ్బందులు కలిగినా, ఆపన్నులకు అభయ హస్తాలై, మీ వెన్నంటే ఉన్నాం అంటూ, బాసటగా నిలుస్తున్నారు. అలా అంటే వారు ఒప్పుకోరు. సత్య హరిశ్చంద్ర, రంతి దేవ, దాన కర్ణాది దాతృత్వ శిఖరాల నేపథ్యం ఉన్న పుణ్య భూమిలో, లక్షలాది దాతలు ఒకదానికి తెలీకుండా మరొకటిగా రెండు చేతులా దాన ధర్మాలు, ప్రధానంగా గుప్త దానాలు చేస్తున్న ధర్మాత్ముల అడుగు జాడల్లో మానవత్వం నేర్పిన పాఠాల క్రమంలో, ఉడుతా భక్తిగా సహకారం అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నాం అంటారు... ఆ ఆదర్శ దంపతులు. వారే ధర్మపురి ఎమ్మెల్యే, రాష్ట్ర సంక్షేమ శాఖల అమాత్యులు కొప్పుల ఈశ్వర్, ఆయన సహ ధర్మచారిణి స్నేహ లత.

జూలపెల్లి మండలం కుమ్మరి కుంట గ్రామంలో 1959 ఏప్రిల్ 20న కొప్పుల లింగయ్య, మల్లమ్మ దంపతులకు ఈశ్వర్ జన్మించి,

కొత్తగూడెంలో పెరిగి, సికింద్రా బాద్, రాజోలు, కొత్తపేట, బల్ హర్షా, తదితర ప్రాంతాలు బ్రతుకు తెరువు కోసం తిరిగిన, తన తండ్రి బ్రతుకు బండి లాగడంతో, పడిన కష్టాలను తెలుసుకుని, అర్థం చేసుకుని, తండ్రి బాటనే ఎంచుకుని, సింగరేణిలో కార్మికు డిగా చేరారు.

1982 జూలైలో 15న, సీపీఐ ఎంఎల్ సీపీ గ్రూపు నాయకుని కూతురును, పక్కా ఆషాఢ మాసంలో, గోదావరిఖనిలో, కమ్యునిస్ట్ విప్లవోద్యమ నాయకుల సమావేశంలో, అదే వేదికపై, దండలు మార్చుకుని, ఆదర్శ వివాహం చేసుకున్నారు. అంతేకాదు ఉద్యమంలో మరణించిన స్నేహలత అనే ఉద్యమ నాయకురాలు పేరును, కోకిల అనే గత పేరు మార్చి తన సహధర్మ చారిణికి పెట్టడం, ఈశ్వర్ ఆదర్శానికి మరింత వన్నె తెచ్చిన నేపథ్యం. సొంత లాభం కొంత మానుకు తోటివారికి సాయ పడాలని గురజాడ అప్పారావు హిత వచనాలు కార్యరూపం కల్పిస్తూ తన భర్త రాష్ట్ర సంక్షేమ శాఖల మంత్రి కొప్పుల ఈశ్వర్ చేదోడు వాదోడుగా ఎన్నో సామా జిక సేవా కార్యక్రమాలను స్వయంగా నిర్వహిస్తున్న స్నేహ లత, భర్త మనసులోని ప్రతి ఆలోచన కు సహకారం కల్పించడంలో చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారు. సింగరేణి కార్మిక నాయకుడైన ఈశ్వరును వివాహ మాడిన నాటినుండి సహధర్మ చారిణిగా, ఆయన ప్రతి అడుగులో అడుగు వేస్తూ, చేదోడు వాదోడుగా ఉంటున్నారు.

నిరంతర ప్రజా సేవే లక్ష్యంగా వరుసగా ఆరు మార్లు ఎన్నికల్లో గెలిచి ఎమ్మెల్యేగా, చీఫ్ విప్ గా, ప్రస్తుతం పలు శాఖల మంత్రిగా ప్రజాహిత కార్యక్రమాల్లో నిరంతరం బిజీగా ఉంటుండగా... తాము స్థాపించిన ఎల్ ఎం చారిటబుల్ స్వచ్ఛంద సంస్థ ద్వారా, ప్రతి ప్రజా సేవ స్ఫూర్తిగా తీసుకొని వాటికి తగిన సతిగా స్వయంగా స్వచ్ఛంద సంస్థ నిర్వహణ బాధ్యతలు స్వీకరించి, పలు విధ సేవలు అందిస్తున్నారు. తెరాస అధినేత కేసిఆర్ స్వయంగా ఆహ్వానించిన సందర్భంగా, తన బాట ఉద్యమ బాటేయని తలంచి, తెలంగాణ రాష్ట్ర సాధనే ధ్యేయం గా, ఉద్యమాలకు నాయకత్వం వహించి, ఈశ్వర్ సాధారణ శాసనసభ ఎన్నికలలో పోటీ చేసి, వరుసగా ఓటమి ఎరుగని నేతగా, జయకేతనం ఎగుర వేసి, విజయుడై, డబుల్ హ్యాట్రిక్ సాధించి రికార్డు నెలకొల్పారు. పార్టీలో సీనియర్ గా, సౌమ్యుడిగా, కేసీఆర్ కు, ఉద్యమ సహచరునిగా, అత్యంత సన్నిహితులుగా, విశ్వాస పాత్రునిగా, అంతకుమించి వీర విధేయుడిగా, ఉన్న కొప్పుల ఈశ్వర్, స్వామి భక్తి పరాయణతకు కేసిఆర్ వద్ద ప్రత్యేక గుర్తింపు ఉంది. ధర్మపురి నుండి మూడవసారి వరుసగా గెలుపొంది, కేసీఆర్ ప్రతిపాదిత స్పీకర్ పదవికి మొగ్గు చూపక, నిరంతరం ప్రజల మధ్యనే ఉండాలని తలంచి, అటు తర్వాత రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ గా బాధ్యతలు స్వీకరించారు. తెలంగాణ మలి ప్రభుత్వంలో ఈశ్వర్ విధేయతకు, సేవా భావానికి గుర్తింపుగా రాష్ట్ర ప్రభుత్వంలో పలు సంక్షేమ శాఖల



అమాత్యునిగా ముఖ్యమంత్రి కేసీఆర్, తన నమ్మిన బంటు ఈశ్వర్ కు, ఉచిత పదవిని కట్టబెట్టారు.

కొప్పుల ఈశ్వర్ తల్లిదండ్రులు ఎల్లమ్మ లింగయ్య పేరున చారిటబుల్ ట్రస్ట్ స్థాపించగా, గత కొన్ని ఏళ్లుగా స్నేహలతా ఈశ్వర్ నేతృత్వంలో, పలు సామాజిక ప్రజా ప్రయోజన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. పేదలకు ఆపన్న హస్తాలు అందించడం, ఆపన్నులకు అవసరాలకు తగ్గ సాయం చేయడం, వికలాంగులకు సహాయ సాధనాలు, ట్రై సైకిళ్లు వందల సంఖ్యలో అందజేయడం, ప్రధానంగా పేదల ఇంట అన్నీ తామే అయి, ఇంటి పెద్దల పాత్రలు పోషిస్తూ పెళ్లిళ్లు చేయడం లాంటి, అనేకానేక వైయక్తిక, సామాజిక కార్యక్రమాలు చేపడుతూ ప్రశంసా పాత్రులు అవుతున్నారు. విద్యా రంగంపై దృష్టి నిలిపి ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల తేడా లేకుండా ఎస్ఎస్సి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ వ్యక్తిత్వ వికాస శిక్షణ కార్యక్రమాలు వందల పాఠశాలలో నిర్వహించారు. పరీక్షల సన్నాహక శిబిరాలు నిర్వహించారు. 10 జి పి ఎ, 9పైన సాధించిన వందలాది మంది విద్యార్థులకు ప్రోత్సాహ కాలు అందించారు. 100 శాతం గిరిజన గ్రామమైన ఆకుసాయి పల్లెలో కనీస విద్యార్హత లేని గిరిజన యువకులకు వాహనాల నడుపుట కోసం డ్రైవింగ్ లైసెన్స్ లను తమ ట్రస్టు పక్షాన ఉచితంగా ఇప్పించారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా రికార్డు స్థాయిలో 407 మంది విద్యార్థులను, 478 మంది టీచర్లను, హెచ్‌ఎం లను ఒకే వేదికపై చేర్చి నాటి ప్రభుత్వం శాసన మండలి చీఫ్ విప్ పాతూరి సుధాకర్ రెడ్డి తో కలిసి వందలాది మందికి శంకర్ నారాయణ నిఘంటువులు సర్టిఫికెట్లు ఆంధ్రజ్యోతి శాలువాలతో బోధకులను సన్మానించారు.

జన్మ ఇచ్చిన, తన ఎదుగుదలకు కారణ భూతులైన, తన తల్లదండ్రుల్ని నిరంతరం జ్ఞాపకం చేసుకుంటూ, ఎల్ ఎమ్ కొప్పుల చారిటబుల్ ట్రస్టు పేరున, తద్వారా ఎందరో నిరు పేదలకు పెళ్ళి పెద్దలై, ఖర్చుల భరించి, దగ్గరుండి జరిపించడం, అడిగిన వారికి లేదనకుండా ఆర్థికంగా ఆదు కోవడం నిత్య కృత్యాలే. సీఎం రిలీఫ్ ఫండ్, ఎల్.ఓ. సీల ద్వారా రాష్ట్రంలో గరిష్టంగా నిధులు పొందిన ఘనత ఈశ్వర్ దే.

ప్రస్తుత కరోనా మహమ్మారి విజృంభణ సమయంలో, ప్రభుత్వ కార్యక్రమాల తోపాటు, తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో, లక్షలాది రూపాయలు, గల్ఫ్ లో చిక్కుకున్న వారికి, కోరిన వెంటనే, పే టి ఎం ద్వారా ఆదుకున్నారు. తన అనుచరుల ద్వారా సాయం అందించే కృషి చేశారు. వలస కార్మికుల, కూలీలకు ఆహారం, సామానులు, ఇతర సాయం చేయాలని ఆరాట పడుతున్న వారిని ప్రోత్సహిస్తున్నారు. ప్రస్తుతం వేయి మంది నిరుద్యోగులకు గ్రూప్స్, పోలీస్ తదితర పోటీ పరీక్షలకు అవసరం వారికి ఉచిత స్టడీ మెటీరియల్ అందించడంతో పాటు వివిధ అంశాల నిపుణులతో శిక్షణ ఇప్పిస్తున్నారు.

ఎమ్మెల్యేగా, చీఫ్ విప్ గా, పలు శాఖల మంత్రిగా, పేదలపై, ప్రత్యేక దృష్టితో వూహించని రీతిలో సంక్షేమ కార్ర్యమాలను చేపట్టారు. కొన్నింటిని సీఎం ప్రశంసించి, ప్రభుత్వ సంక్షేమ కార్ర్యమాలుగా అమలు చేస్తున్నారు కూడా. ఏకైక కూతురు నందిని, అల్లుడు అనీల్, మనవడితో, గడపడానికే సమయం చిక్కనంత బిజీగా, ప్రజా ప్రాతినిధిత్వం నెరపు తున్నారు. సింగరేణి గని కార్మికుని స్థాయి నుండి రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ శాఖల మంత్రిగా క్రమానుగతంగా జన హృదయ నేతగా, ఈశ్వర్ ఎదుగుదల క్రమంలో, ఎంతో పట్టుదల, చిత్తశుద్ధి, కార్యదీక్ష దక్షత, అంకితభావం, అన్నింటినీ మించి నిస్వార్థ సేవ భావం గణనీయ పాత్ర వహించాయి.

బాధను ప్రకటితం చేయకుండా, హర్షానికి ఉప్పొంగి పోకుండా, ఎల్లప్పుడూ చిరు దరహాస వదనారవిందులై, ప్రజా సేవే పరమావధిగా, నిరంతరం ప్రజల మధ్య గడపడమే, అవసరమైన వారికి సేవ చేయడమే, సామాన్యుల సాధక బాధకాలను గమనించి, నేనున్నానని భరోసా కల్పించడమే, జీవిత లక్ష్యమని పదే పదే చెపుతుంటారు వారు... ఎదుటివారి సమస్యలను తమ స్వంత సమస్యలుగా ఎంచి, వాటి పరిష్కారం కోసం అహరహం కృషి చేస్తూ, ఆనందాన్ని, తృప్తిని పొందుతున్న కర్మయోగులు స్నేహ లతా ఈశ్వర్ దంపతులు అనడంలో రవంతైనా అతిశయోక్తి లేదేమో...



రామ కిష్టయ్య సంగన భట్ల...
9440595494

## గురు పరంపరకు ఆద్యుడు వ్యాసభగవానుడు

తిరుమల,జూలై13 : పుట్టిన రోజు ఇష్టపడని వారుండరు. ప్రతి మనిషీ ఏదో ఒకరోజు పుడతాడు. పెరిగి, పెద్దవాడై జ్ఞానవంతు డవుతాడు. జ్ఞానానికి పుట్టుక ఉంది. జ్ఞానం పుట్టినరోజే గురువు పుట్టినరోజు. గురువంటే వెలుగు. వెలుగు జ్ఞానానికి ప్రతీక. ఆ జ్ఞానం జన్మదినోత్సవం జరుపుకొనే రోజే గురుపూర్ణిమ. శిష్యులు ఆనందోత్సాహాల్లో ఓలలాడే రోజు. గురుచంద్రుడు ఆధ్యాత్మిక ఆకాశంలో హాయిగా విహరిస్తూ జ్ఞానమనే వెలుగును వెదజల్లుతుంటాడు... ఈ దృశ్యం శాశ్వత ఆధ్యాత్మిక వారసత్వ సంపదగా వస్తోంది. దీన్ని అనాదిగా అందిస్తున్నవాడు 'వ్యాసభగవానుడు'. ఆయనే గురుపరంపరకు ఆద్యుడు. ఆయన పుట్టినరోజే ఆషాఢ శుద్ధ పూర్ణిమ. అదే వ్యాసపూర్ణిమ లేదా గురుపూర్ణిమ గా పిలుస్తారు.నేత్రాలు లేకపోయినా ఎలాగోలా బాధలు పడుతూ మనో నేత్రంతో బతకవచ్చు. జ్ఞానం లేకుండా బతకడం అసాధ్యం. ఆ జ్ఞానాన్ని శిరస్సుపై మోస్తున్న గురువు లేకుండా బతికే సంప్రదాయం మనలో లేదు. అందుకే ఎవ్వరూ ఏ పండగలూ చేసుకోని ఆషాఢ మాసంలో కూడా గురువును పూజించే పద్ధతిని ఏర్పరచారు పూర్వీకులు.

# వరదముప్పు ఇంకా తొలగలేదు

**మొదటిపేజీ తరువాయి..**

గోదావరి నది ఉప్పొంగి ప్రవహిస్తోంది. నదీ పరివాహక ప్రాంతాలు నీట మునిగిపోయాయి. ఈ క్రమంలో మరింత అప్రమత్తత అవసరమని మంత్రి అన్నారు. జూలైలో సాధారణం కంటే 450 శాతం ఎక్కువగా వర్షపాతనీ నమోదైందని కేటీఆర్ తెలిపారు. పెద్దపల్లి, జగిత్యాల, నిర్మల్‌లో అసాధారణ పరిస్థితులు లేవని.. అయినా ఉదాసీనంగా, అలక్ష్యంగా ఉండొద్దని హెచ్చరించారు. ప్రాణనష్టం జరగకుండా చూడాలని అధికారులకు ఆయన సూచించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ లో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ... ఆస్తి నష్టం తగ్గే విధంగా చూడాలని, జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఇరిగేషన్ అధికారులు, ఇతర ప్రభుత్వ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. మున్సిపాల్టీలతో సహా అన్ని గ్రామాల్లో సేఫ్టీ అడిట్ జరగే విధంగా చూడాలన్నారు. ప్రజల ప్రాణాలను కాపాడాల్సి వచ్చినప్పుడు కఠినంగా వ్యవహరించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. నిర్మాణ పనులు జరిగే చోట హెచ్చరిక బోర్డులు, బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్, ఎస్పీ జడ్పీ చైర్ పర్సన్, మున్సిపల్, ఇరిగేషన్, ఇంజనీరింగ్ విభాగాలకు సంబంధించిన అధికారులు పాల్గొన్నారు. పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాలపై ఎఫెక్ట్ పడింది. పెద్దపల్లి జిల్లా మంథని గోదావరి నది ఒడ్డున ఉన్న గౌతమేశ్వర ఆలయం చుట్టూ ...భారీగా వరద నీరు చేరింది. దీంతో.. గుడి దగ్గరున్న 20 మంది వరదల్లో చిక్కుకున్నారు. పూజారుల కుటుంబ సభ్యులు 17మంది, మరో ముగ్గురు చేపల వేటగాళ్లు సహాయం కోసం ఎదురుచూస్తున్నారు. తమను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని కోరుతున్నారు.

## తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తాం

**మొదటిపేజీ తరువాయి..**

గంగుల కమలాకర్ కీలక ప్రకటన చేశారు. తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. భారీ వర్షాల కారణంగా ధాన్యం కొనుగోళ్లు ఆగిపోయాయని చెప్పిన మంత్రి.. ఈ వర్షాల కారణంగా ధాన్యం తడిసిందన్నారు. అందుకే రైతులకు ఇబ్బంది లేకుండా తడిసిన ధాన్యాన్ని కూడా కొనేందుకు సర్కార్ సిద్ధమైందన్నారు.ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వంపై మంత్రి గంగుల కమలాకర్ తీవ్ర విమర్శలు చేశారు. కేంద్రం వివక్ష వైఖరి కారణంగానే ధాన్యం కొనుగోలులో ఆలస్యం జరిగిందని, ఇప్పుడు రైతులు ఇబ్బందులు పడుతున్నారని దుయ్యబట్టారు. ధరణి పోర్టల్‌పై బీజేపీ నేతలు చేస్తున్న ఆరోపణలు ఖండించారు మంత్రి గంగుల. ధరణి పోర్టల్ తెచ్చాక 98 శాతం సమస్యలు పోయాయని అన్నారు. ధరణి వల్లే సమస్యలు, గొడవలు తగ్గాయన్నారు. త్వరలో జరిగే రెవెన్యూ సదస్సులో ఆ కొద్దిపాటి సమస్యలను కూడా పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. ఇక బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ దీక్షపై విరుచుకుపడ్డారు మంత్రి గంగుల. మౌన దీక్ష ప్రధాని మోదీ ఇంటి వద్ద చేద్దాం పదా అని అన్నారు. అందరికీ రూ. 15 లక్షలన్న ప్రధాని మోదీ కోసం ప్రతీ ఏటీఎం వద్ద కుర్చీలు వేసుకుని నిరసన చేద్దామని అన్నారు. ఉద్యోగాలు ఇవ్వనందుకు యూపీఎస్సీ వద్ద కుర్చీ వేద్దామన్నారు. గ్యాస్ ధర పెంచినందుకు ప్రతి ఇంటిముందు కుర్చీ వేసి దీక్ష చేద్దామని బండికి సవాల్ విసిరారు.

## పార్లమెంట్‌లో ఇష్టానుసారం మాట్లాడడం కుదరదు

**అన్‌పార్లమెంట్ పదాల జాబితా విడుదల**

న్యూఢిల్లీ,జూలై14: పార్లమెంట్‌లో సభ్యులు ఇష్టానుసారంగా నోరు పారేసుకోవడం ఇక కుదరదు. అన్ పార్లమెంటరీ పదాలను వాడితే సభ్యులపై చర్యలు తప్పవు. లోక్‌సభ, రాజ్యసభలో అభ్యంతరకర పదాలు వాడొద్దని ఎంపీలకు లోక్‌సభ సెక్రటేరియట్ సూచించింది. ఈ మేరకు ఓ బుక్‌లెట్‌ను విడుదల చేసింది. సిగ్గులేదు, ధోకేబాజ్, అసమర్థుడు, నాటకం, నటన, అవినీతి పరుడులాంటి మరిన్ని పదాలను బుక్ లెట్ లో చేర్చింది. కరప్ట్, కవర్డ్, హూలిగనిజం, బ్లడీ, బీట్రేడ్, అషేమ్డ్, హిపోక్రసీ, మిస్‌లీడ్, లై, క్రొకొడైల్ టియర్స్, బ్లడ్‌షెడ్, డాంకీ, డ్రామా, అప్‌మాన్, కాలా బజారీ, చంచా, చంచాగిరి, అబ్యూస్డ్, చీటెడ్, క్రిమినల్, గూన్స్, దలాల్, దాదాగిరీ, లాలీపాప్, వినాశ్ పురుష్, ఖలిస్తానీ, బేహ్రీ సర్కారు, బాబ్‌కట్, జుమ్లాజీవీ, శకుని, విశ్వాస్‌ఘాత్, సంవేదన్‌హీన్, ఐవాష్, అన్‌ట్రూ, కోవిడ్ స్ప్రెడర్, గిర్గిట్, బేచారా, అసత్య, అహంకార్ వంటి ఇంగ్లీషు పదాలను అందులో చేర్చారు. ఈనెల 19వ తేదీ నుంచి వర్షకాల సమావేశాలు ప్రారంభం కానున్న సంగతి తెలిసిందే. అన్ని పార్టీల కీలక నేతలతో ఈ నెల 17న ఉదయం సమావేశం నిర్వహించనున్నట్లు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి బుధవారం వెల్లడించారు. ఎజెండాపై చర్చ, సమావేశాలు సజావుగా జరగడానికి అన్ని పార్టీల మద్దతును కోరనున్నారు. అఖిలపక్ష భేటీకి ప్రధాని నరేంద్ర మోడీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌హాజరుకానున్నారు. కాగా, పార్టీల ఎ÷-లోర్ లీడర్ల సమావేశాన్ని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా జూలై 16న సాయంత్రం ఏర్పాటు చేయనున్నారు. రాజ్యసభ చైర్మన్ వెంకయ్యనాయుడు 17న సాయంత్రం వివిధ పార్టీల ఫ్లోర్ లీడర్లతో సమావేశం కానున్నారు. ఈ నెల 18న ప్రారంభమయ్యే పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ఆగస్టు 12 వరకు కొనసాగుతాయి.

## కొవిడ్‌కి కొత్త వ్యాక్సిన్ నోవావాక్స్

**అనుమతించిన అమెరికా ప్రభుత్వం**

వాషింగ్టన్,జూలై14: కొవిడ్ మహమ్మారికి కొత్త వ్యాక్సిన్ నోవావాక్స్‌కు అమెరికా దేశానికి చెందిన ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ తాజాగా అనుమతి ఇచ్చింది. అమెరికా దేశంలో కొవిడ్ వైరస్ నివారణ కోసం కొత్త వ్యాక్సిన్ నోవావాక్స్‌ను తాజాగా అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ నోవోవాక్స్ వ్యాక్సిన్ ఇప్పటికే యూరప్ తో పలు దేశాల్లో అందుబాటులో ఉంది. నాలుగింట ఒక వంతు అమెరికన్ పెద్దలు ఇంకా కొవిడ్ వ్యాక్సిన్ వేయించుకోలేదు. వారు ప్రొటీన్ ఆధారిత వ్యాక్సిన్ కోసం ఎదురు చూస్తున్న నేపథ్యంలో ఈ కొత్త వ్యాక్సిన్ అందుబాటులోకి వచ్చింది. కరోనాకు తమ కంపెనీ వ్యాక్సిన్ అత్యుత్తమ బూస్టర్ ఎంపిక అని కంపెనీ పేర్కొంది. 18 సంవత్సరాల కంటే అధికంగా వయసు ఉన్న వ్యక్తులు నోవోవాక్స్ వ్యాక్సిన్లు రెండు డోసులు వేసుకునేందుకు యూఎస్ ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ ఆమోదించింది. బిడెన్ అడ్మినిస్ట్రేషన్ ఇప్పటివరకు 3.2 మిలియన్ నోవావాక్స్ డోస్‌లను కొనుగోలు చేసిందని, ఈ నెలలో టీకాలు వేయడం ప్రారంభిస్తామని నోవావాక్స్ సీఈఓ స్టాన్లీ ఎర్క్ చెప్పారు.

## ప్రధాని మోడీ హత్యకు కుట్ర

**ఇద్దరు ఉగ్రవాదుల అరెస్ట్**
**కుట్ర కోణంపై సమగ్ర దర్యాప్తు**

పాట్నా,జూలై14: ప్రధానమంత్రి నరేంద్రమోదీ హత్యకు పన్నిన కుట్రను బిహార్ పోలీసులు భగ్నం చేశారు. పాట్నాలో మోదీని లక్ష్యంగా చేసుకొని కుట్ర పన్నిన ఇద్దరు అనుమానిత ఉగ్రవాదులను అరెస్ట్ చేశారు. పాట్నాలోని ఫుల్వారీ షరీఫ్ ప్రాంతంలో ఉగ్రవాద కదిలక గురించి ఇంటెలిజెన్స్ బ్యూరోకి సమాచారం అందింది.



అనంతరం పోలీసులు, కేంద్ర ఏజెన్సీలు జూలై 11న నయా తోలా ప్రాంతంలో దాడి చేసి అనుమానిత ఉగ్రవాదులను అదుపులోకి తీసుకున్నారు. అరెస్టయిన వీరిద్దరూ పాకిస్థాన్, బంగ్లాదేశ్, టర్కీతో సహా పలు ఇస్లామిక్ దేశాల నుంచి దేశంలో ఉంటూ దేశ వ్యతిరేక ప్రచారాలు చేసేందుకు డబ్బును పొందేవారని దర్యాప్తులో తేలింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 2047 నాటికి భారత్‌ను ఇస్లామిక్ దేశంగా మార్చేందుకు ఉగ్రవాదులు ప్రయత్నిస్తున్నట్లు గుర్తించారు. అంతేగాక జూలై 12న మోదీ బిహార్ పర్యటన సందర్భంగా ఆయన్ను లక్ష్యంగా చేసుకొని ఉగ్రవాదులు కుట్ర జరిగినట్లు వెల్లడించారు. అరెస్ట్ చేసిన వారిని జార్ఖండ్ రిటైర్డ్ పోలీసు అధికారి మహ్మద్ జల్లావుద్దీన్, అథర్ పర్వేజ్‌గా పోలీసులు పేర్కొన్నారు. వీరికి పీఎఫ్‌ఐతో లింకులు ఉన్నట్లు గుర్తించారు. అనుమానిత ఉగ్రవాదులు ప్రధాని పర్యటనకు 15 రోజుల ముందు ఫుల్వారీ షరీఫ్‌లో శిక్షణ పొందినట్లు పోలీసులు కనుగొన్నారు. జూలై 6,7 తేదీల్లో మోదీ టార్గెట్‌గా వ్యూహాత్మక సమావేశాలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. దీంతో ఉగ్రవాదుల ఫుల్వారీ షరీఫ్ కార్యాలయంలో బీహార్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పోలీసులు పలు నేరారోపణ డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. వాటిలోని ఒక దాంట్లో '2047 వరకు ఇండియాను ఇస్లామిక్ ఇండియాగా మార్చాలి' అని ఉంది. వీటితోపాటు 25 పీఎఫ్‌ఐ కరపత్రాలను స్వాధీనం చేసుకున్నారు.

# సామాజిక సేవలకు ప్రతిరూపం దుర్గాబాయ్ దేశ్‌ముఖ్

## జూలై 15... దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ జయంతి

ఆమె ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధురాలు, సంఘ సంస్కర్త, రచయిత్రి. దేశభక్తు రాలిగా, సామాజిక సేవా తత్పరు రాలుగా ... మరెవరూ చూపని ధైర్య సాహసాలను, ప్రజ్ఞను చూపి చరిత్రలో నిలిచి పోయారు. తెలుగు ప్రజలు గర్వించ దగిన ఉన్నత భావాలు కలిగిన మహోన్నత వ్యక్తి. వ్యక్తి మాత్రమే కాదు, ఒక వ్యవస్థ. మేధావిగా, న్యాయ కోవిదు రాలుగా, మానవతా వాదిగా, ఆంధ్ర మహిళాసభ వ్యవస్థాపకురాలిగా.. బహుముఖ ప్రజ్ఞను కనబరిచి చరిత్రపుటల్లో మహామనిషిగా నిలిచిన ఆ ఉక్కు మహిళ దుర్గాబాయ్ దేశ్ ముఖ్. ఒక బాలికగా జాతీయోద్యమానికి ప్రేరేపితురాలై, జాతిపిత, చాచా నెహ్రూ లాంటి జాతీయోద్యమ నేతల మన్ననలను అందు కున్నారు. గాంధీజీ ఆంధ్ర రాష్ట్ర పర్యటనకు విరాళాల సేకరణ కోసం కాకినాడ వచ్చినపుడు ఆయన ప్రసంగాన్ని తెలుగులో చేసిన అనువాదానికి గాంధీజీ అభినందనలకు పాత్రు లైనారు. ఆ సందర్భంలో విరాళాలు సేకరించడమే కాక, మహాత్ముడు అడిగితే తన చేతి బంగారు గాజులు కూడా సమర్పించిన త్యాగమయి. కాకినాడలో 1923లో జరిగిన కాంగ్రెసు మహాసభలకు టికెట్టు లేకుండా వచ్చిన జవాహర్లాల్ నెహ్రూను అనుమతి లేదని వెనక్కి పంపిన ధీశాలి. దుర్గాబాయ్ చిన్ననాటి నుండే స్వాతంత్ర్య పోరాటంలో పాలుపంచు కున్నారు. తన 12 యేండ్ల వయసులో ఆంగ్ల విద్యపై పోరాటం చేశారు. ఆమె రాజమండ్రిలో బాలికలకు హిందీలో విద్యను అందించడానికి బాలికా హిందీ పాఠశాలను ప్రారంభించారు.

దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ మద్రాసు ప్రెసిడెన్సి (ప్రస్తుత ఆంధ్ర ప్రదేశ్) లోని రాజమండ్రిలో, 1909 జూలై 15 న సంప్రదాయ బ్రాహ్మణ కుటుంబానికి చెందిన రామారావు, కృష్ణవేణమ్మ దంపతులకు జన్మించారు. పది సంవత్సరాల వయస్సులోనే హిందీలో పాండిత్యాన్ని సంపాదించి, హిందీ పాఠశాలను నెలకొల్పి అన్ని వయసుల వారికీ విద్యాబోధన



అందించారు. బెనారస్ విశ్వ విద్యాలయం నుండి మెట్రి క్యులేషన్, ఆంధ్ర విశ్వ విద్యాలయం నుండి ఎం.ఏ (పొలిటికల్ సైన్స్), 1942లో ఎల్. ఎల్.బి పూర్తిచేసింది. న్యాయశాస్త్ర చదువు పూర్తయ్యాక మద్రాసులో హైకోర్టులో సాధన ప్రారంభించారు. న్యాయ కోవిదురాలిగా, ప్రఖ్యాత క్రిమినల్ లాయర్‌గా పేరుగాంచారు.
ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నందుకు జైలు శిక్ష కూడా అనుభవించారు.

భారతదేశ రాజ్యాంగ సభ, ప్రణాళికా సంఘ సభ్యురాలు. ఆమె నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఉమెన్ ఎడ్యుకేషన్ కు మొదటి చైర్ పర్సన్ గా వ్యవహరించారు. 1953 ఆగస్టులో భారత ప్రభుత్వంచే నెలకొల్పబడిన కేంద్ర సాంఘిక సంక్షేమ బోర్డుకు వ్యవస్థాపక అధ్యక్షురాలిగా, ఢిల్లీలో బ్లైండ్ రిలీఫ్ అసోసియేషన్‌కు అధ్యక్షురాలిగా పని చేశారు. ఆమెను భారతదేశంలో సోషల్ సర్వీస్ మదర్ గా పిలిచేవారు.
అనేక మహిళా సంస్థలు, సాంఘిక సంక్షేమ సంస్థలను ప్రారంభించి స్త్రీల అభ్యున్నతికి కృషిచేశారు. ఆమె ఆధ్వర్యంలో 1937లో చెన్నపట్నంలో (ప్రస్తుత చెన్నై లో) ఆంధ్ర మహిళా సభ స్థాపించ బడింది. హైదరాబాద్ లో ఆంధ్ర మహిళా సభను స్థాపించారు. ఇప్పటికీ పనిచేసే ఆసంస్థ పేరుతోనే ఆవీధిని పిలుస్తారు. అక్కడ వితంతువులకు,అనాథ స్త్రీలకు చదువు చెప్పించడం, రకరకాల పనులలో శిక్షణ ఇప్పించి వారి కాళ్ళమీద వారు నిలబడేటట్లుగా తయారు చేసేవారు. రాష్ట్ర మంతటా ఎన్నో కళాశాలలు, వసతిగృహాలు, నర్సింగ్ హోమ్‌లు, వృత్తి విద్యాకేంద్రాలు నెలకొల్పారు.

లిటిల్ లేడీస్ ఆఫ్ బృందావన్ అనే బాల సంఘాన్నికూడా స్థాపించారు. నర్సింగ్ కాలేజీలను స్థాపించారు. ఆంధ్ర మహిళ పత్రికను స్థాపించి సంపాదకత్వం వహించారు. 1953 జనవరి 22న దేశ్‌ముఖ్ వివాహం దుర్గాబాయ్ తో జరిగింది. అది ద్వితీయ, అంతర్రాష్ట్ర, ఆదర్శ వివాహం అయినందున దేశంలో గొప్ప సంచలనం సృష్టించింది. వారి పెళ్లి పత్రంపై నెహ్రూ, ఆచార్య కృపలానీ దంపతులు సాక్షులుగా సంతకాలు చేశారు.

దుర్గాబాయ్‌తో వివాహం జరిగిన తర్వాత మొదటి జన్మదినాన్ని ఆయన తన ఇంట్లో చాలా నిరాడంబరంగా జరుపు కున్నారు. ఈ సంగతి నెహ్రూకు తెలిసి, తీరిక చేసుకొని నెహ్రూ వాళ్ల ఇంటికి వెళ్లారట. 'ఏం దుర్గాబాయ్! దేశ్‌ముఖ్ నీ భర్తే కావచ్చు.. నా క్యాబినెట్ మంత్రి సుమా!' అని చమత్కరించారట. ఆ దంపతులు ఇచ్చిన టీ బిస్కెట్ తీసుకుని నెహ్రూ మందహాసంతో వెళ్లిపోయారట. ఇలాంటి ఆప్యాయత ఈ రోజుల్లో కనిపించడం బహు అరుదు.

1971లో సాక్షరతా భవన్ ని ప్రారంభించారు. ఆంధ్ర విశ్వ విద్యాలయం దుర్గాబాయికి 1971లో గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. 1975లో భారత ప్రభుత్వం పద్మ విభూషణ పురస్కారంతో సత్కరించగా, అదే సంవత్సరం ఆయన సతీమణి దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ కూడా పద్మ విభూషణ్ పొందడం, భార్యా భర్తలు ఇద్దరూ ఒకే ఏడాది పురస్కార గ్రహీతలు కావడం విశేషం. ఆంధ్ర విశ్వ విద్యాలయం నుండి గౌరవ డాక్టరేట్, 1971 – నెహ్రూ లిటరసీ అవార్డు (వయోజన విద్యాసేవలకు గుర్తింపుగా), యునెస్కో నుండి పాల్ జి. హాఫ్‌మన్ అవార్డు పొందారు.
అసమాన ప్రజ్ఞా పాటవాతో చిర కాలం గుర్తుండే కార్యక్రమాలకు పురుడు పోసిన దుర్గాబాయ్ 1981 మే 9వ తేదీన హైదరాబాదులో మరణించారు.




రామ కిష్టయ్య సంగన భట్ల...
9440595494

# భారత్‌లో మంకీపాక్స్ తొలి కేసు నమోదు

**మొదటిపేజీ తరువాయి..**

జాగ్రత్తలు తీసుకుంటామని తెలిపారు. ఇటీవల యూఏఈ నుంచి తిరిగొచ్చిన ఓ వ్యక్తి మంకీపాక్స్ తరహా లక్షణాలతో ఆసుపత్రిలో చేరినట్లు కేరళ ఆరోగ్యశాఖ మంత్రి వీణా జార్జ్ వెల్లడించారు. వైరస్ నిర్ధారణ పరీక్షల నిమిత్తం అతడి నుంచి నమూనాలను సేకరించి పుణెలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ కి పంపినట్లు తెలిపారు. తాజాగా వచ్చిన ఫలితాల్లో అది మంకీపాక్స్‌గా నిర్ధారణ అయినట్లు ప్రకటించారు. సదరు వ్యక్తి



యూఏఈలో మంకీపాక్స్ సోకిన వ్యక్తితో సన్నిహితంగా మెలిగారని.. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగానే ఉన్నట్లు వెల్లడించారు. మరోవైపు ఆయనతో సన్నిహితంగా ఉన్న ప్రైమరీ కాంటాక్టులను గుర్తించామన్నారు. బాధితుడి తల్లి దండ్రులు, టాక్సీ, ఆటో డ్రైవర్లతోపాటు మరో 11 మంది తోటి ప్రయాణికులను ప్రైమరీ కాంటాక్టులుగా గుర్తించామని ఆరోగ్యశాఖ మంత్రి వీణా జార్జ్ వెల్లడించారు. ఇదిలాఉంటే, గత కొంతకాలంగా వేగంగా విస్తరిస్తోన్న మంకీపాక్స్ ఇప్పటికే 59 దేశాలకు పాకింది. 6వేల మందిలో నిర్ధారణ కాగా.. ముగ్గురు మృత్యువాతపడ్డారు. మంకీపాక్స్ కేసులు ఎక్కువగా యూరప్, ఆఫ్రికాలోనే నమోదవుతున్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించింది. అయితే, ముఖ్యంగా స్వలింగ సంపర్కుల్లోనే ఈ కేసులు ఎక్కువగా వెలుగు చూస్తున్నాయని నిపుణులు పేర్కొంటున్నారు.

దేశంలో ఇన్నాళ్లు 20 వేలకు లోపు నమోదు అవుతూ వచ్చిన కేసుల సంఖ్య తాజాగా 20 వేలను దాటింది. దేశంలో అన్ని రాష్ట్రాల్లోనూ కోవిడ్ కేసుల సంఖ్య పెరుగుతోంది. మహారాష్ట్రతో పాటు వెస్ట్ బెంగాల్, కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లో కేసుల సంఖ్య పెరుగుతోంది. ప్రజలు అత్యంత జాగ్రత్తగా ఉండాలని ప్రభుత్వాలు సూచిస్తున్నాయి. తాజాగా గడిచిన 24 గంటల్లో దేశంలో కొత్తగా 20,139 కేసులు నమోదు అయ్యాయి. 38 మంది కోవిడ్ బారినపడి మరణించారు. 16,482 మంది కోవిడ్ బారి నుంచి బయటపడ్డారు. ప్రస్తుతం దేశంలో యాక్టివ్ కేసుల సంఖ్య 1,36,076కు చేరింది. పాజిటివిటీ రేటు ప్రస్తుతం 5.10 శాతానికి చేరింది. దాదాపుగా కొన్ని నెలల తర్వాత తొలిసారిగా ఇండియాలో కేసుల సంఖ్య 20 వేలను దాటింది. దేశవ్యాప్తంగా కరోనా వల్ల ఇప్పటి వరకు 5,25,557 మంది మరణించగా, 4,30,28,356 మంది కోవిడ్ బారిన పడి మళ్లీ రికవరీ అయ్యారు. మరోవైపు దేశంలో వ్యాక్సినేషన్ ప్రక్రియ వేగవంతంగా సాగుతోంది. ఇప్పటి వరకు ఇండియాలో అర్హులైన వారికి 199,27,27,559 డోసుల వ్యాక్సినేషన్ అందించింది. బుధవారం ఒక్కరోజే దేశంలో 13,44,714 మందికి టీకా ఇచ్చారు. తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ గురువారం ఆస్పత్రిలో చేరారు. చెన్నైలోని అళ్వార్‌పేట్‌లో ఉన్న కావేరి ఆస్పత్రిలో ఆయన చేరారు. జూలై 12వ తేదీన ఆయన కోవిడ్ పరీక్షలో పాజిటివ్ తేలిన విషయం తెలిసిందే. కోవిడ్ సంబంధిత లక్షణాలు ఉన్న కారణంగా సీఎం స్టాలిన్ హాస్పిటల్‌లో చేరారని, ఆయనకు పరీక్షలు నిర్వహిస్తున్నామని, అబ్జర్వేషన్‌లో ఉంచామని హాస్పిటల్ ఓ ప్రకటనలో తెలిపింది. సీఎం స్టాలిన్ త్వరగా కోలుకోవాలని గవర్నర్ ఆర్ఎన్ రవి ఆకాంక్షించారు.

# బుల్లెట్ రైలుకు పచ్చజెండా

**భూసేకరణపై తొలగిన అడ్డంకులు**
**2026 నాటికి అందుబాటులోకి వచ్చే అవకాశం**

ముంబయి,జూలై14: ముంబయి– అహ్మదాబాద్ బుల్లెట్ రైలు ప్రాజెక్ట్‌లో కీలక ముందడుగు పడింది.
ఈ ప్రాజెక్టుకు భూసేకరణతో పాటు ఉన్న ఇతర అడ్డంకులు తొలగిపోయాయి. తాజాగా కొలువుదీరిన ఏక్‌నాథ్ శిందే నేతృత్వంలోని ప్రభుత్వం ఈ మేరకు అన్ని అనుమతులూ మంజూరు చేసింది. ప్రాజెక్ట్‌కు అన్ని క్లియరెన్సులూ లభించినట్లు మహారాష్ట డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడణవీస్ గురువారం వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బుల్లెట్ రైలు ప్రాజెక్ట్‌కు ఉద్ధవ్ నేతృత్వంలోని మహా వికాస్ అఘాడీ ప్రభుత్వం మోకాలడ్డిన సంగతి తెలిసిందే. మహారాష్ట్రలో పూర్తి స్థాయిలో భూసేకరణ జరగకపోవడంతో ఈ ప్రాజెక్ట్ ఆలస్యమైంది. ఈ నేపథ్యంలో ఇటీవల ఏక్‌నాథ్ శిందే తిరుగుబాటుతో కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. దీంతో బుల్లెట్ ప్రాజెక్ట్ పనులు ఊపందుకుంటాయని వార్తలు వినిపించాయి. అందుకు అనుగుణంగానే శిందే ప్రభుత్వం కొద్ది రోజుల్లోనే నిర్ణయం తీసుకుంది. 2017లో అప్పటి జపాన్ ప్రధాని షింజో అబెతో కలిసి ప్రధాని మోదీ ఈ ప్రాజెక్ట్‌కు శంకుస్థాపన చేశారు. 508 కిలోమీటర్ల దూరం కలిగిన ఈ



కారిడార్లో మొత్తం 12 స్టేషన్లు ఉంటాయి. ఈ ప్రాజెక్ట్ కోసం ₹1.10 లక్షల కోట్లు వెచ్చిస్తున్నారు. ప్రస్తుతం ముంబయి– అహ్మదాబాద్ మధ్య ప్రయాణానికి ఏడెనిమిది గంటల సమయం పడుతుండగా.. బుల్లెట్ రైలు అందుబాటులోకి వస్తే కేవలం రెండు గంటల్లోనే గమ్యస్థానాన్ని చేరుకోవచ్చు. గంటకు 320 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే ఈ రైలు 2026 నాటికి అందుబాటులోకి వస్తుందని అంచనా.

# శ్రీలంక అధ్యక్షుడు గొటబాయ రాజపక్స రాజీనామా

**ధ్రువీకరించిన శ్రీలంక పార్లమెంట్ స్పీకర్**
**రాజీనామా లేఖ అందినట్లు వెల్లడించిన మహింద అభయవర్ధన**

కొలంబో,జూలై14: ప్రజాగ్రహానికి గురై దేశం విడిచి పారిపోయిన శ్రీలంక అధ్యక్షుడు గొటబాయ రాజపక్స ఎట్టకేలకు తన పదవికి రాజీనామా చేశారు. మాల్దీవుల నుంచి సింగపూర్‌కు వెళ్లిన అనంతరం అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ విషయాన్ని ధ్రువీకరించిన శ్రీలంక పార్లమెంట్ స్పీకర్ మహింద అభయవర్ధన..



రాజీనామా లేఖ అందినట్లు వెల్లడించారు. మరోవైపు గొటబాయ రాజీనామా చేశారనే వార్త వినగానే శ్రీలంకలో సంబరాలు మొదలయ్యాయి.ఆర్థికంగా, రాజకీయంగా కుదేలైన శ్రీలంక నిరసనలతో అట్టుడుకుతోంది. అధ్యక్ష భవనంతోపాటు ప్రధాని నివాసంపై దాడి చేసిన ఆందోళనకారులు.. అధ్యక్షుడు, ప్రధాని వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నారు. దేశంలో సంక్షోభానికి కేంద్ర బిందువుగా ఉన్న అధ్యక్షుడు గొటబాయ రాజపక్స మాత్రం మాల్దీవులకు పారిపోయారు. అక్కడ కూడా నిరసనలు మొదలు కావడంతో తాజాగా ఆయన సింగపూర్‌కు వెళ్లిపోయారు. అయితే, ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోన్న సమయంలో బుధవారం నాడు రాజీనామా చేస్తానని తొలుత ప్రకటించారు. కానీ, ఆయన చెప్పినట్లు చేయలేదు. ఇదే సమయంలో శ్రీలంకలో అత్యయిక స్థితి ప్రకటించడంతోపాటు పశ్చిమ ప్రావిన్సులో కర్ఫ్యూను విధించారు. ఇలా పరిస్థితులు చేయిదాటిపోతోన్న సమయంలో శ్రీలంక అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నట్లు గొటబాయ ప్రకటించారు.

## నేటి తెలంగాణలో నుంచి ఉచితంగా బూస్టర్ డోస్

**ప్రభుత్వ దవాఖానాల్లో ఇవ్వనున్న ప్రభుత్వం**

హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ టీకా కేంద్రాల్లో కొవిడ్ బూస్టర్ డోస్ అందుబాటులోకి రానుంది. శుక్రవారం నుంచి ప్రభుత్వ దవాఖానాల్లో ఉచితంగా కొవిడ్ వ్యాక్సిన్ బూస్టర్ డోస్ ఇవ్వనున్నట్టు తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. 18ఏళ్లు పైబడి అర్హులైన ప్రతి ఒక్కరికీ బూస్టర్ డోస్ ఇచ్చేందుకు కేంద్రం అనుమతి ఇవ్వడంపై మంత్రి హరీశ్‌రావు




హర్షం వ్యక్తం చేశారు. రెండో డోస్ తీసుకుని 6 నెలలు పూర్తయిన వారికి ప్రభుత్వ దవాఖానాల్లో ఉచితంగా బూస్టర్ డోస్ ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని ఈ సందర్భంగా మంత్రి వెల్లడించారు. 75రోజుల పాటు జరిగే వ్యాక్సినేషన్ కార్యక్రమంలో భాగంగా అర్హులైన వారందరికీ బూస్టర్ డోస్ ఇచ్చేలా, తద్వారా కరోనా నుంచి కాపాడుకునేందుకు రోగ నిరోధకశక్తిని పెంపొందించుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. రాష్ట్రంలో కొవిషీల్డ్, కొవాగ్జిన్ కలిపి మొత్తం 20లక్షల డోసుల నిల్వ ఉందని మంత్రి తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ బూస్టర్ డోస్ అందించేలా ఏర్పాట్లు చేయాలని వైద్యారోగ్యశాఖ అధికారులను ఆదేశించామన్నారు. శుక్రవారం నుంచి అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో, జూనియర్, డిగ్రీ, ఇంజినీరింగ్ కాలేజీలు, యూనివర్సిటీల్లోనూ వ్యాక్సిన్ అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. సికింద్రాబాద్, నాంపల్లి, కాజీపేట రైల్వేస్టేషన్లతో పాటు, మహాత్మాగాంధీ, జూబ్లీ బస్‌స్టేషన్‌లలో 24 గంటలపాటు బూస్టర్ డోస్ అందుబాటులో ఉంచుతామని మంత్రి తెలిపారు.

## వరద నుంచి బయటపడ్డ ఇటుకబట్టీ కార్మికులు

కరీంనగర్,జూలై14: జిల్లాలోని కరీంనగర్ రూరల్ మండలం నగునూర్ వాగులో చిక్కుకున్న ఒడిశాకు చెందిన 9 మంది ఇటుక బట్టి కార్మికులు సురక్షితంగా బయటపడ్డారు. వాగులో చిక్కుకున్న కార్మికులను రెస్క్యూ టీం క్షేమంగా ఒడ్డుకు చేర్చింది. కాగా, విషయం తెలిసిన వెంటనే బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ అధికారులను అప్రమత్తం చేశారు. దగ్గరుండి సహాయక చర్యలను పర్యవేక్షించారు.

## ఎన్‌పిడిసిఎల్ పరిధిలో బదిలీలకు రంగం సిద్ధం

**హన్మకొండ జులై 14 (ప్రజామంటలు):** వరంగల్ నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ పరిధిలోని 17 జిల్లాల్లో విధులు నిర్వహిస్తున్న ఏఈ ల నుండి ఏడిఈ కేడర్




వరకు ఉన్న అధికారులను బదిలీ చేయాలని నిర్ణయించారు. మూడేళ్లకు పైబడి ఒకేచోట పనిచేస్తున్న వారిని బదిలీల జాబితాలో చేర్చారు. గత జూన్ 30 వరకు మూడేళ్లు సర్వీస్ పూర్తి చేసిన 96 మంది జాబితాను ఎన్‌పిడిసిఎల్ అధికారులు తయారు చేసారు. అయితే ఈ జాబితాలో సవరణలు ఉన్నట్లయితే ఈ నెల 15 లోగా తెలపాలని కోరారు.

## చిత్రలేఖన కళ ప్రోత్సాహానికి చిలువేరు విజ్జు కాకతీయ ఆర్థిక సహాయం

**జనగామ జూలై 14 (ప్రజామంటలు):** చిత్రలేఖన కళను విస్తరణ కోసం జనగామ కేంద్రంగా పని చేస్తున్న మసురం రాజేంద్ర ప్రసాద్ చేస్తున్న కృషికి స్పందించి



విదేశాలలో ఉన్న చిన్ననాటి స్నేహితుడు చిలువేరు విజ్జు తమ వంతు సహాయంగా ఆర్థిక సహకారం గురువారం అందించారు. జనగామ జిల్లా కేంద్రంగా ప్రారంబించబడిన పుల్లయ్య కళానిలయం వ్యవస్థాపకులు మసురం రాజేంద్రప్రసాద్ చిత్రకళారంగంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో చేస్తున్న కృషిని గుర్తించి, ప్రశంసిస్తూ అమెరికాలో ఉన్న చిన్ననాటి మిత్రులు చిలువేరు విజ్జు కాకతీయ తమవంతుగా రూ. 15,000/- ఆర్థిక సహకారం అందించారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.... చిలువేరు విజ్జు కాకతీయ ఆర్థిక సహకారానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ డబ్బుతో చిత్రలేఖనం ఫోటోల ఫ్రేమ్స్ ఎగ్జిబిషన్ లో పెట్టుకోవడానికి వీలుగా స్థిరంగా ఉండేలా తయారు చేయిస్తామని తెలిపారు. చిత్రలేఖన కళను ప్రోత్సహించడం కోసం మానవత దృక్పధంతో ముందు వచ్చి సహకారం అందించాలని రాజేంద్ర ప్రసాద్ కోరారు.



టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ మాజీ ఎం.పి. మల్లు రవి జన్మదినం సందర్భంగా ఆయనను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన టీపీసీసీ మాజీ అధ్యక్షులు పొన్నాల లక్ష్మయ్య, ఏఐసిసి సిడబ్ల్యుసి సభ్యులు సుబ్బిరామిరెడ్డి, పిసిసి మాజీ అధ్యక్షులు హన్మంతరావు.

## నేడే శివునిపల్లిలో డా. బి.ఆర్. అంబేద్కర్ జీవిత చరిత్ర నాటక ప్రదర్శన

**స్టేషన్ ఘనపూర్ జూలై 14 (ప్రజామంటలు):** ఈనెల 15న స్టేషన్ ఘనపూర్ మండలం శివునిపల్లిలో డా. బి. ఆర్ అంబేద్కర్ జీవిత చరిత్ర నాటక ప్రదర్శన



జయప్రదం చేయ్యాలని బి.ఎస్.పి. జనగామ జిల్లా అధ్యక్షుడు తాళ్లపల్లి వెంకటస్వామి విజ్ఞప్తి చేశారు. స్టేషన్ ఘనపూర్ లో బి ఎస్ పి ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.... ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అభ్యుదయ ఆర్ట్స్ అకాడమి వారిచే సంఘం శరణం గచ్ఛామి పేర అంబేద్కర్ జీవిత చరిత్ర నాటక ప్రదర్శన సాయంత్రం 6గంటలకు కె.ఆర్. గార్డెన్స్ ఎర్పాటు చేయడం జరిగిందని అన్నారు.ప్రధానంగా ఈ నాటికలో అంబేద్కర్ బాల్యం, మానవహక్కుల పోరాటంలో మహాద్ చెరువు పోరాటం, భారత దేశంలో ప్రతి వయోజన పౌరునికి ఓటు హక్కును కల్పించడం, మనుషులతో పాటు సకల జంతు ప్రాణుల హక్కులను కల్పించిన రాజ్యాంగం ఆమోదింపజేసే పోరాటాలు, అట్టడుగు వర్గాలకు రాజ్యాదికారమే అంతిమ లక్ష్యంగా స్ఫూర్తినిచ్చే విధంగా కొనసాగుతుందన్నారు. ప్రజలు నాటికను తిలకించి జయప్రదం చేయాలని వెంకటస్వామి కోరారు. నిర్వాహకులు అంబేద్కర్ యువజన సంఘం, ద్రవిడ బహుజన సమితి, దళిత శక్తి ప్రోగ్రాం, స్వేరోస్, లంబాడా హక్కుల పోరాట సమితి నాయకులు పాల్గొన్నారు.

## భారీ వర్షాలలో.... అనాధలకు, భిక్షకులకు అన్నదానం



**జగిత్యాల జూలై 14 (ప్రజామంటలు):** గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు అనాధలు, భిక్షకు లకు మేమున్నాము అంటూ రెండు రోజులుగా జగిత్యాల తెరాస విద్యార్థి నాయకులు బోగోజీ ముకేశ్ ఖన్నా ఆధ్వ ర్యంలో ఆహారం పంపిణి చేయ డం జరిగింది. రెండు రోజులు గా కొత్త బస్ స్టాండ్ లో పేదల కోసం ఆహారం పంపిణి చేస్తున్నామని, పేదల పక్షాన తెరాస అండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పులి నర్సయ్య, పాలొజీ సత్యం, షేక్. వాజీద్, మొయిజ్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రమాదం పొంచి ఉన్న వాగులు, వంకలు, చెరువులు దగ్గర

## హెచ్చరిక బోర్డ్ లను ఏర్పాటు చేయాలి

- **జెడ్పీ చైర్ పర్సన్ దావ వసంత**

**జగిత్యాల జూలై 14 (ప్రజామంటలు):** ఎన్. టీవి రిపోర్టర్ జమిర్ వరదల్లో గల్లంతు కావడం చాలా బాధాకరం అని జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత అన్నారు. హెచ్చరిక బోర్డ్ లు ఉండి ఉంటే ఇలాంటి సంఘటనలు జరగకుండా ఉంటాయని అన్నారు. గత కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు జగిత్యాల రూరల్ మండలంలోని హన్మజిపెట్, పోరండ్ల గ్రామాలలో జలమయమైన లోతట్టు ప్రాంతాలను అధికార బృందంతో పరిశీలించి పోరండ్ల గ్రామంలోని చెరువు నిండి గండి పడగా స్థానిక గంగ పుత్ర యువకులు గండికి ఇసుక సంచులు వేసి దిగువ అప్రమత్తం చేశారు. విషయం తెలుసుకున్న జిల్లా పరిషత్ చైర్మన్ దావ వసంత సురేష్ అక్కడికి వెళ్లి గండి పడిన ప్రాంతాన్ని పరిశీలించి, అధికారులను ప్రజలకు ఇబ్బంది లేకుండా సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను స్థానిక నాయకులు, అధికారులతో కలిసి పునరావాస కేంద్రాలను తరలించి వారికి కావలసిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎంపీపీ రాజేంద్రప్రసాద్, సర్పంచ్ లు దామోదర్ సంధ్య, ఎంపీటీసీ సౌజన్య తిరుపతి, ఉప సర్పంచ్ రాజ నర్సయ్య,



గ్రామ శాఖ అధ్యక్షుడు నరేష్ అరే రవి నాయకులు గంగారెడ్డి, నాగిరెడ్డి గంగారెడ్డి, శేఖర్, రాజేష్, లింగం, మహేష్, హరీష్ ప్రజా ప్రతినిధులు, డిఈ రాజన్న ఎంపిడిఓ రాజేశ్వరి, ఎంఆర్ఓ నవీన్, ఎంపీవో రవి బాబు, ఏఈ శ్రీధర్ తదితులున్నారు.

## ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకూడదు

- **మంత్రి ఎర్రబెల్లి దయాకరరావు**

**జనగామ జూలై 14 (ప్రజామంటలు):** గత వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ప్రజలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొనకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మంచినీటి సరఫరా శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకరరావు అధికారులను ఆదేశించారు. గురువారం మంత్రి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ శివలింగయ్య ఆధ్వర్యంలో గత వారం రోజుల నుండి కురుస్తున్న వర్షాల నేపథ్యంలో వరదల అంచనా, వర్షాల ప్రభావం, అధికారులు తీసుకున్న చర్యలపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రికి కలెక్టర్ వివరిస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పలు శాఖల అధికారులతో



సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి తక్షణ చర్యలు చేపడుతున్నామని, చీట కోడూరు రిజర్వాయర్ ను సందర్శించామని, ఓవర్ ఫ్లో లేకపోయినా అధికారులను అప్రమత్తం చేశామన్నారు. అధికారులు జిల్లాలో పర్యటిస్తూ ప్రతి గంట గంటకు సమీక్షిస్తున్నామని, స్టేషన్ ఘన్పూర్ మండలంలో సముద్రాల గ్రామము వద్ద బావి కూలడంతో రహదారికి ఇబ్బందులు ఏర్పడడంతో బావిని పూడిపించే విధంగా వెంటనే చర్యలు తీసుకుంటూ పనులను పర్యవేక్షిస్తున్నామన్నారు. అనంతరం మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు....మాట్లాడుతూ వర్షాలకు అంటువ్యాధులు ప్రభలకుండా చర్యలు తీసుకోవాలని, పారిశుధ్యం మెరుగు పరచాలని, ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం స్టేషన్ ఘన్పూర్ మండలంలో జడ్పీ చైర్మన్ పాగాల సంపత్ రెడ్డి జిల్లా కలెక్టర్ శివలింగయ్య, శాసనసభ్యులు డాక్టర్ తాటికొండ రాజయ్య తో పర్యటించి అవెన్యూ ప్లాంటేషన్ ను మంత్రి పరిశీలిస్తూ మొక్కలు నాటడం కాకుండా వాటికి సపోర్ట్ కర్ర ఏర్పాటు చేయించాలని, మొక్కలను పశువులు మేకలు, గొర్రెలు తినకుండా పరిరక్షణకు ముళ్ల కంపను పెట్టించాలన్నారు. జనగామ జిల్లా స్టేషన్ ఘన్పూర్ మండలం సముద్రాల గ్రామం వద్ద ఇటీవల భారీ వర్షాలకు కూలిన మైసం బావిని సందర్శించి పూడిపించే పనులను తనిఖీ చేశారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు భాస్కరరావు, అబ్దుల్ హమీద్, జెడ్పి సీఈఓ విజయలక్ష్మి డిఆర్డిఎ పీడి రామ్ రెడ్డి, డిపిఓ రంగాచారి తదితర అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

### ఆర్టీసీ ఆదాయం పెంచేందుకు

## అధికారులు సమన్వయంతో పని చేయాలి

**జనగామ జూలై 14 (ప్రజామంటలు):** ఆర్టీసీ ఆదాయం పెంచేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ సిహెచ్ శివలింగయ్య ఆదేశించారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశం మందిరంలో ఆర్టీసీ స్పెషల్ డ్రైవ్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.... ఆర్టీసీ సంస్థ ప్రజల భద్రత కోసం ఏర్పాటు చేయబడిందని ఆ సంస్థ ను కాపాడుకునేందుకు అధికారులందరూ సమన్వయంతో పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రమాదాలను నివారించేందుకు రవాణా శాఖ అధికారులు ఓవర్ లోడ్ వాహనాలను నియంత్రించాలని, వాహనాల సామర్థ్యం పరిశీలించాలన్నారు. పోలీస్ శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపడుతూ



ప్రమాదాలు నివారించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు అతివేగంగా జాతీయ రహదారులపై ప్రయాణించే వాహనాల వలన ప్రమాదాలు జరుగుతున్న దృశ్య వేగాన్ని కూడా నియంత్రింపజేయాలన్నారు. వారానికి ఒక్కసారైనా అధికారులందరూ స్పెషల్ డ్రైవ్ చేయ పట్టాలని సూచించారు ఆర్టీసీ అధికారులు కూడా హరితహారం లో మొక్కలు నాటాలని బస్టాండ్లను అందంగా తీర్చిదిద్దాలన్నారు. ప్రతి బస్టాండ్ లో త్రాగునీటి సౌకర్యాల ఏర్పాటు చేయాలని ఆటో లను బస్ స్టాండ్ ఆవరణలోనికి రానియ్యకూడదన్నారు. వృద్ధులకు వికలాంగులకు మాత్రమే ఆటోలపై బస్టాండ్ లో వచ్చేందుకు అవకాశం ఇవ్వాలని సూచించారు. అలాగే బస్సులను పరిశుభ్రంగా ఉంచాలని వాటి సామర్థ్యాన్ని ఎప్పటికప్పుడు పరీక్షింపజేసి ధ్రువీకరణ పత్రాలు అందజేయాలన్నారు జాతీయ రహదారులలో వాహనాలను ఎట్టి పరిస్థితులలోను నిలుపుదల చేయరాదని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. జీపులు, ఆటోలు, ప్రైవేటు వాహనాలు సామర్థ్యంకు మించి ప్రయాణికులను ఎక్కిస్తే వాహనాలను సీజ్ చేయాలన్నారు. వారి లైసెన్సు లను కూడా రద్దు చేయాలన్నారు. రవాణా శాఖ అధికారులు రోడ్డు భద్రత కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో డిసిపి సీతారాం ఆర్టీసీ ఆర్ఎం వి. శ్రీదేవి రవాణా శాఖ అధికారి శ్రీనివాసరావు, డిప్యూటీ ఆర్ఎం బి. కృపాకర్ రెడ్డి, డిపో మేనేజర్ వి. జోత్స్న తదితరులు పాల్గొన్నారు.

### ఆదాయపు పన్ను

## ఈ-ఫైలింగ్‌కు సూచనలు

- **హరి అశోక్ కుమార్**

**జగిత్యాల జులై 14 (ప్రజామంటలు):** ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షర్లు ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా 31 జూలై, 2022 లోగా ఆదాయపు పన్ను గురించి 'ఈ-ఫైలింగ్' చేయించుకోవాల్సి ఉంటుందని తెలంగాణ పెన్షనర్స్ అసోసియేషన్, జగిత్యాల జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్ సూచించారు. ఆయన గురువారం జిల్లా కేంద్రంలో విలేకరులతో మాటా డారు. ( 2021- 22 ఆర్థిక సంవత్సరం 2022-23 అస్సెస్మెంట్ సంవత్సరం) లో.... ఉద్యోగులు వేతనం, పెన్షన్ దారులు పెన్షన్ మరియు ఇతర ఆదాయము 3లక్షల 50 వేలు, ఆ పైన ఆదాయం కలిగిన ఉద్యోగులు," ఎన్షనర్లు తప్పకుండా ఈ ఫైలింగ్ చేయించు కోవాలని సూచించారు. ఈ- ఫైలింగ్" చేయించు కోవడానికి చివరి తేదీ: 31 జులై, 2022 అని మర్చిపో కండని ఆయన ఉద్యోగులను, పెన్షనర్స్ ను కోరారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి బొల్లం విజయ్, కోశాధికారి గౌరిశెట్టి విశ్వనాథం, సహాయ అధ్యక్షులు పి.ఎస్. హన్మంత్ రెడ్డి, రఘుపతి, యాకూబ్, పబ్బా శివానందం, విద్యాసాగర్, కరుణ తదితరులు పాల్గొన్నారు.



## వరుస ముసురులతో వడ్డెర బస్తీలో కూలుతున్న ఇంటి గోడలు

**సికింద్రాబాద్ జులై 14 (ప్రజామంటలు):** గత వారం రోజులుగా వరసగా



కురుస్తున్న ముసురు వాన కారణంగా సనత్ నగర్ నియోజకవర్గంలోని బేగంపేట డివిజన్ లోని వడ్డెరబస్తీ లోని పలు ఇండ్లు దెబ్బతిన్నాయి. వడ్డెర బస్తీలోని ఓ బిల్డింగ్ కు సంబందించిన గోడ ను 20 అడుగుల ఎత్తులో నిర్మించడం వలన వాన నీరు దక్షిణం వైపు పోకుండా బస్తీలో నిలిచిపోవడం కారణంగా చాలా ఇండ్ల గోడల్లోకి నీరు ఇంకిపోయి, ఇండ్లు కూలిపోయే ప్రమాదం పొంచి ఉందని స్థానికులు వాపోతున్నారు. ఈ కారణంతోనే రాజేశ్ అనే వ్యక్తి ఇంటి గోడలు దెబ్బతిన్నాయని వారు పేర్కొన్నారు. ఇలాగే మరిన్ని వర్షాలు కురిసినట్లయితే చాలా ఇండ్లు కుప్పకూలే ప్రమాదం పొంచి ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బల్దియా అధికారులు స్పందించి వడ్డెర బస్తీ సమస్యలను తీర్చాలని స్థానిక బస్తీకి చెందిన నర్సింహా, జంగయ్య, జగన్, వెంకటయ్య, సాయికిరణ్ తదితరులు కోరుతున్నారు.

## రోళ్ల వాగు పరిశీలించిన ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్

**జగిత్యాల జూలై 14 (ప్రజామంటలు):** బీర్ పూర్ మండలం రోళ్ల వాగు ప్రాజెక్టు పాత కట్ట గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు తెగిపోగా గురువారం



రోళ్ల వాగు పాత కట్టను ఇరిగేషన్ సిఈ సుధాకర్ రెడ్డి తో కలిసి పరిశీలించిన ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్. ఈ కార్యక్రమంలో కెడీసీసీ జిల్లా మెంబెర్ రామచందర్ రావు, జిల్లా రైతు మెంబెర్ కొలుముల రమణ, సర్పంచ్ ప్రభాకర్, ఎంపీటీసీ సృజన సుషీన్, మండల రైతు బంధు కన్వీనర్ మెరుగు రాజేశం, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి శీలం రమేష్, ఉప సర్పంచ్ హరీష్, ఆలయ ఛైర్మెన్ సుమన్, గ్రామ శాఖ అధ్యక్షడు సుధాకర్, ఈఈ నారాయణ రెడ్డి, డిఈ చెక్రు, నాయక్, నాయకులు, రైతులు, పాల్గొన్నారు.

## ధర్మ సముద్రం ను పర్యవేక్షించిన మున్సిపల్ కమీషనర్

**జగిత్యాల జూలై 14 (ప్రజామంటలు):** జగిత్యాల పట్టణ ఫిల్టర్ బెడ్ ధర్మ సముద్రంను పర్యవేక్షించిన మున్సిపల్ కమిషనర్ స్వరూప రాణి. బారి వర్షాలకు



ధర్మ సముద్రం నిండు కోవడంతో కట్ట సంరక్షణ ఇసుక బస్తాలను నింపి కట్ట గా వేయించడమైనది. ఈ సందర్భముగా కమిషనర్ మాట్లాడుతూ.... కట్టను ఎప్పటికపుడు పర్యవేక్షించాలని, అదనముగా ఇసుక బస్తాలను ఏర్పాటు చేసి సిద్ధముగా ఉంచుకోవాలని, బారి వర్షాలకు అన్ని విధాల సిద్ధముగా ఉండాలని అధికారులను ఆదేశించినారు. వీరి వెంట కౌన్సిలర్ దేవేందర్ నాయక్, డి.ఈ. రాజేశ్వర్, జే.ఎ.ఒ గణేష్, యస్.ఐ. రాము, నీటి సరఫరా సిబ్బంది ఉన్నారు.

## యన్స్ క్లబ్ ఆఫ్ జనగామ ఆధ్వర్యంలో వృద్దులకు 'రగ్గుల పంపిణీ'

**జనగామ జూలై 14 (ప్రజామంటలు):** లయన్స్ క్లబ్ ఆఫ్ జనగామ సభ్యుడు నాథాని రాధాకిషన్ రేఖ పెళ్లి రోజు సందర్భముగా స్థానిక రాజేశ్వరి వృద్ధ ఆశ్రమములో వృద్దులకు జనగామలో గత 4 రోజులుగా భారీ వర్షాలు పడటంతో



వృద్దులు చలికి బాధను చూసి రాధాకిషన్ దాదాపు 10 వేల విలువ చేసే రగ్గులు అలాగే పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమములో అధ్యక్షుడు కూతటి ఉప్పలయ్య, డిస్ట్రిక్ట్ గవర్నర్ లైజన్ ఆఫీసర్ కృష్ణ జీవన్ బజాజ్, రీజియన్ ఛైర్మెన్ గంగిశెట్టి ప్రమోద్ కుమార్, పిఆర్‌సి ఎదమ సంజీవ రెడ్డి, కార్యదర్శి చిదురాల బాబు, కోశాదికారి సముద్రాల సందీప్, రీజియన్ కార్యదర్శి, వై.మోహన్ రెడ్డి, డిసి వెంకట్ నారాయణ, రాజేశ్వరి, టి. కృష్ణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పుట్టినరోజు సందర్భంగా వాల్మీకి ఆవాసంలో అన్నదానం

**కొడిమ్యాల జూలై 14 (ప్రజామంటలు):** కొడిమ్యాల కు చెందిన మాణిక్యం శ్రీనివాస్-శైలజ ల కుమార్తె లక్షిత రెండవ జన్మదినం సందర్భంగా జగిత్యాల





లోని వాల్మీకి ఆవాసములో గల 50 మంది విద్యార్థులకు ఒక రోజుకు సరిపడే అల్పాహారం మరియు రెండు పూటల భోజనం, స్వీట్స్ అందించడం జరిగింది. మరియు భగినీ నివేదిత సేవ సమితి (బాలికల అవాసము) వారికి అల్పాహారం మరియు రెండు పూటల భోజనం స్వీట్స్ మరియు పుస్తక సామగ్రి అందించడం జరిగింది.

## జిల్లాలో ఇన్ స్పెక్టర్స్ బదిలీలు

### ఆదేశాలు జారీ చేసిన కమిషనర్

**హన్మకొండ జులై 15 (ప్రజామంటలు):** హన్మకొండ పోలీస్ కమిషనర్ డా. తరుణ్ జోషి కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఆరుగురు ఇనిస్పెక్టర్స్ ని పరిపాలనా కారణాల పై బదిలీ చేశారు. వీరి సిహెచ్ శ్రీనివాస్ జి, వి వేణుమాధవ్, వై సంజీవ రావు, ఎం సై రమణ, వి నరేశ్ కుమార్, ఆర్ సంతోష్. వీరిని తక్షణమే విధుల్లో చేరాల్సింది గా ఆదేశాలు జారీ అయ్యాయి. డా.తరుణ్ జోషి పోలీసు కమిషనర్ గా పాలన పగ్గాలు చేపట్టిన రోజు నుండి శాఖను తనదైన శైలిలో ప్రక్షాళన చేస్తున్నారు. ఈయన పరిపాలనలో రాజీ లేని ధోరణి అవలంభిస్థున్నారు. పోలిస్ శాఖలో చాలా మందికి తరుణ్ జోషి పై సదాభిప్రాయం ఉంది.

## శ్రీమద్ దేవి భాగవతం జ్ఞాన యజ్ఞం

**జగిత్యాల జూలై 14 (ప్రజామంటలు):** జిల్లా కేంద్రం లోని శ్రీ వాసవి మాత



ఆలయ ప్రాంగణములో ఆశాడ మాసం సందర్భంగా గురువారం శ్రీమాన్ నంబి వేణుగోపాలా చార్యుల మంగళాశాసనములతో సభాపతి తిగుళ్ల విష్ణుశర్మ చే తొమ్మిది రోజుల పాటు జరుగనున్నది. జ్ఞాన యజ్ఞం ఉదయం 9:00 గం నుండి 12:00 గం వరకు సాయంత్రం 4:00 గం. నుండి 6: 00 గంటల వరకు జరుగనుంది. శ్రీమాన్ నంబి వేణు గోపాలాచార్య, ఆర్య వైశ్య సంఘము అధ్యక్షులు మంచాల కృష్ణ జ్యోతి ప్రజ్వలనంతో ప్రారంభమైంది. మాతలు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

## బీసీ కాలనీలో విద్యుత్తు పునరుద్ధరణ

**కొడిమ్యాల జూలై 14 (ప్రజామంటలు):** కొడిమ్యాల మండల కేంద్రంలో గల





13వ వార్డు లోని లక్ష్మీ వెంకటేశ్వర స్వామి టెంపుల్ సమీపంలోని బీసీ కాలనీలో గత నాలుగు రోజుల నుండి కురుస్తున్న వర్షాల వలన చెట్లు విద్యుత్తు తీగలపై పడి స్తంభాలు విరిగిపోవడం జరిగింది. గురువారం రోజున చెట్లను తొలగించి విద్యుత్తు స్తంభాలను విద్యుత్తు తీగలను సరిచేసి పునరుద్ధరించారు. ఈ విద్యుత్ పునరుద్ధరణ కొరకు సర్పంచ్ ఏలేటి మమత నరసింహారెడ్డి జెసిబి ని పంపించి చెట్లను తొలగించారు. అదేవిధంగా 13వ వార్డు సభ్యులు దీకొండ చంద్రశేఖర్ మరియు విద్యుత్తు శాఖ అధికారులు లైన్ ఇన్స్పెక్టర్ రామయ్య, లైన్ మెన్ ఎర్రోజు వేణు, సీనియర్ లైన్ మెన్ బత్తిని రవి, వార్డులోని ప్రజలు సహకరించారు.

## భాజపా ఆధ్వర్యంలో ఘనంగా గురుపూజోత్సవం

**తరిగొప్పుల నర్మెట్ట జులై 14 (ప్రజామంటలు):** భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు ధారావత్ రాజు నాయక్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం సందర్భంగా నర్మెట మండల కేంద్రంలోని గురువులను సాల్వతో సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ జిల్లా అధ్యక్షులు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కెవిఎల్ఎన్ రెడ్డి హాజరయ్యారు అనంతరం వారు మాట్లాడుతూ, మనందరిలోనూ పవిత్రమయిన హృదయం ఉంది. కాని చీకటి అనే అజ్ఞానంతో మనసంతా చెడు ఆలోచనల తోనూ, దుర్గుణాలతో నిండిపోవడం వల్ల దానిని గుర్తించలేక పోతున్నాము. మన అజ్ఞానం ఎంతంటే? దీపం వెలిగించ మన్నప్పుడు నీటికీ , నూనెకు తేడా తెలియనట్టు వంటి చీకటి స్థితిలో ఉన్నాము. మరి ఈ చీకటి స్థితి నుంచి బయటపడి జ్ఞానదీపాన్ని వెలించు కోవాలంటే మంచి సద్గురువు చాలా అవసరం.



**గురువు అంటే :**

గురువు అంటే బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు ఒకటై జన్మించిన రూపం అంటే సాక్షాత్ పరబ్రహ్మ స్వరూపమే గురువు. గు అంటే అంధకారము లేదా అజ్ఞానాన్ని, రు అంటే నిరోధించుట లేక నశింప చేయుట అని గురువు అంటే అజ్ఞానాన్ని నశింప చేయువారు అని అర్థము. గు శబ్దమంధకారస్యరుతన్నిరోధకః అని **పెద్దల వచనం!**

గురువు చేయవలసినది తన శిష్యులను అంధకారంలోంచి వెలుగులోకి తీసుకు రావడం. ఈ భౌతిక జగత్తులో ఏ మానవుడూ సంసారయాతనలు అనుభవించకుండా చూడటం ఆ గురువు కర్తవ్యం. ఆ గురువు సాన్నిధ్యంలో కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలు అనే దుర్గుణాలను, అహంకారాన్ని విడిచిపెట్టి ధ్యాన సాధన చేస్తే హృదయం పవిత్రమవుతుంది. అప్పుడు ఆ పవిత్ర మైన హృదయంలో జ్ఞానమనే దీపం వెలిగించుకోవడం సాధ్యమవుతుంది అని అన్నారు.

**విజ్ఞానానికి మూలం విద్య. ఆ విజ్ఞానాన్ని నేర్పేవాడే గురువు.**

అజ్ఞానాన్ని పారద్రోలి జ్ఞానాన్ని అందించే గురువుని ఎప్పుడూ మనం గౌరవించాలి. ఒకప్పుడు గురుకులాలుండేవి. వాటిలో చేరిని విద్యార్థులకు తల్లీ తండ్రీ అన్నీ తామే అయ్యేవారు గురువులు. మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ అంటారు. తల్లీ తండ్రి తరువాత స్థానం గురువుదే.

**"గురుబ్రహ్మా, గురుర్విష్ణుః, గురుర్దేవో మహేశ్వరః**
**గురుస్సాక్షాత్ పరబ్రహ్మా తస్మై శ్రీ గురవే నమః"**

దైవోపచారం చేస్తే గురువైనా రక్షిస్తాడు. అదే గురువుకు కోపం వస్తే ముల్లోకాలలో ఎవరూ రక్షించలేరట. అందుకే సమస్త విద్యలను నేర్పే గురువుకు , జ్ఞనాన్ని అందించే గురువుకు సేవచేసి , గురుకృప పొంది మహనీయులైనవారు ఎందరో వున్నారు. "గురువునూ, గోవిందుడిని పక్కన పెట్టి ముందు ఎవరికి నమస్కారం చేస్తావంటే, గురువుకే నమస్కరిస్తాను. కారణం గోవిందుడు వున్నాడని చెప్పింది గురువే కదా" అంటాడు భక్త కబీర్ దాస్.

అదీ మన భరతీయసంస్కృతి ఆర్షధర్మం నేర్పిన గురువు యొక్క ప్రాముఖ్యం. కాబట్టి గురుపౌర్ణమి నాడు ప్రతి ఒక్కరూ గురువుల్ని పూజించాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో గురువులు పాతూరి మల్లారెడ్డి, ఉపేందర్, బత్తుల నరేందర్, పి. విజయ, మరియుబిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి శివరాజ్ యాదవ్, బిజెపి మండల ప్రధాన కార్యదర్శి తోకల శేఖర్, రఘునాథపల్లి మండల అధ్యక్షులు వల్లాల వెంకటేష్, లింగాల ఘన్పూర్ మండల అధ్యక్షులు భూతు అధ్యక్షులు జహంగీర్, శ్రీనివాస్, సంపత్, తదితరులు పాల్గొన్నారు.

## వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

**మానకొండూర్ జులై 14 (ప్రజామంటలు):** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలంలో దెబ్బతిన్న ఇళ్లను, చెరువులను పరిశీలించిన మానకొండూర్ శాసనసభ్యులు డా. రసమయి బాలకిషన్. గత వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర సాంస్కృతిక సారథి ఛైర్మెన్ మరియు మానకొండూర్ శాసనసభ్యులు డా.రసమయి బాలకిషన్ ప్రజలకు పిలుపునిచ్చారు. మానకొండూర్ మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం వర్షంలో సైతం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆయన విస్తృతంగా పర్యటించారు. శ్రీనివాస నగర్, లింగాపూర్, వెల్ది, లక్ష్మీపూర్, వేగురుపల్లి, ఊటూర్, రంగపేట, లలితాపూర్ గ్రామాలలో వర్షాల కారణంగా దెబ్బతిన్న ఇండ్లను, విద్యుత్ స్తంబాలను, నిండిపోయిన చెరువులను, పరిశీలించి ప్రజా అవసరాలను, ఇబ్బందులను నేరుగా అడిగి తెలుసుకున్నారు. నష్టపోయిన బాధితులకు ప్రభుత్వ పరంగా ఆర్థిక సహాయం అందిస్తామని అధైర్య పదద్దని రసమయి హామీ ఇచ్చారు. ఆయా గ్రామాలకు చెందిన లబ్ధిదారుల ఇళ్లకు స్వయంగా వెళ్లి కళ్యాణలక్ష్మి మరియు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.... వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ



చేస్తున్న నేపథ్యంలో ప్రజల అత్యవసరం అయితే తప్ప బయటకు వెళ్లొద్దన్నారు. రైతులు బావులు, బోర్లు కరెంట్ స్తంభాల దగ్గర జాగ్రత్తగా ఉండాలని, గ్రామాలలో పాత ఇండ్లు, గుడిశ లలో, శిథిలావస్థలో ఉండే పాత ఇళ్లలో ఉండే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అలాగే మానేరు నది తీరా గ్రామాలలో పెద్దలు తమ పిల్లలను,వాగుల వద్దకి వెళ్లకుండా చూడాలన్నారు. వాగులు వంకలలో, రోడ్ డ్యామ్ లలో కూడా నీటి ప్రవాహాలు వచ్చే అవకాశం ఉన్నందున ఆయా ప్రాంతాలలో ప్రజలు అప్రమత్తంగా ఉండేలా తగు చర్యలు చేపట్టాలని కోరారు. ఏదైనా చెరువులు, కుంటలు నీటి ఉధృతికి తెగే అవకాశాలు ఉంటే వెంటనే అధికారులకు సమాచారం అందించాలని అదేవిధంగా విద్యుత్ స్తంబాలను, తీగలను చేతులతో పట్టుకోవద్దని తెలిపారు. వర్షాలు తగ్గేంత వరకు ప్రజలు అప్రమత్తంగా ఉండి తమ ప్రాణాలను కాపాడుకోవాలని, అత్యవసరం అయితే 100 నెంబర్ కు సమాచారం ఇవ్వాలని ఎమ్మెల్యే రసమయి ప్రజలకు వివరించారు.



## ఎడతెరిపిలేని వర్షాలతో కూలీన ఇండ్లు

- బాధితులను తక్షణం ఆదుకోవాలి
- మిల్కురి వాసుదేవ రెడ్డి

**కరీంనగర్ జూలై 14 (ప్రజామంటలు):** గత వారం రోజులుగా అనేక ఇల్లు కూలిపోయాయని బాధితులను తక్షణ ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కురి వాసుదేవ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బీమా సాహెబ్, మండల కార్యదర్శి కొత్తపల్లి అజయ్ లతో కలిసి కొత్తపల్లి పట్టణంలో కూలీన ఇళ్లను పరిశీలించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... పట్టణంలో దాదాపు పది ఇల్లు కూలిపోయాయని అన్నారు. ఇంట్లో ఉన్న నిత్యవసర సరుకులు మొత్తం నీటిలో కలిసిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం ప్రభుత్వము, అధికారులు సర్వే నిర్వహించి బాధితులను ఆదుకోవాలని కోరారు. తక్షణ సహాయంగా బాధితులకు నిత్యవసర సరుకులను అందించాలని ప్రభుత్వాన్ని కోరారు.. ఇండ్లు కూలిపోయిన వారికి డబుల్ బెడ్ రూమ్ పథకం కింద కొత్త ఇండ్లను మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా వ్యాప్తంగా వర్షాల కారణంగా ఆస్తి, పంట నష్టం అంచనా వేయాలని ప్రభుత్వాన్ని కోరారు. బాధితులకు నష్టపరిహారం చెల్లించాలని అన్నారు.



## 104 ఉద్యోగులకు వేతనాలు వెంటనే చెల్లించాలి



**ఎన్.ఎస్.యు.ఐ జిల్లా అధ్యక్షుడు సదుల వినయ్**

కోరుట్ల టౌన్ 14 (ప్రజామంటలు): రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలందిస్తున్న 104 ఉద్యోగులకు వెంటనే జీతాలు చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ.... మూడు నెలల నుండి రాష్ట్ర ప్రభుతం ఇప్పటివరకు వేతనాలు చలించలేదన్నారు. గత మూడు నెలలకు సంబంధించిన వేతనాలు ప్రభుత్వం చెల్లించలేదన్నారు. 104 సర్వీసులు ఫార్మసిస్ట్ ల్యాబ్ టెక్నిషన్ డ్రైవర్ సెక్యూరిటీ గార్డ్ డి ఈ ఓ లు రాష్ట్ర వ్యాప్తంగా 1300 మంది ఉద్యోగులు ఉన్నారని సమయానికి వేతనాలు రాకపోవడంతో ఉద్యోగులు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వేతనాలు లేక పూట గడవని పరిస్థితి ఏర్పడిందని ప్రభుత్వం వెంటనే సమస్యను పరిష్కరించి ఆరోగ్య ఉద్యోగులకు వేతనాలు చెల్లించాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## భారీ వర్షాల నేపథ్యంలో కలెక్టర్ కార్యాలయంలో అధికార్లతో మంత్రి కొప్పుల సమీక్ష

**జగిత్యాల జూలై 14 (ప్రజామంటలు):** గతవారం రోజుల నుండి కురుస్తున్న వర్షాలతో నెలకొన్న తాజా పరిస్థితులపై జగిత్యాల కలెక్టర్ కార్యాలయంలో



జిల్లా కలెక్టర్, జగిత్యాలలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జెడ్పీ ఛైర్ పర్సన్ దావ వసంత తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించిన సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్. ఈ సందర్భంగా ప్రజలకు ఏలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులకు మంత్రి ఆదేశం. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని, స్థానిక ప్రజా ప్రతినిధుల సహాయం తీసుకొని సహాయ కార్యక్రమాలు నిర్వహించాలని సూచన. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్పర్సన్ బోగ శ్రావణి ప్రవీణ్, అదనపు కలెక్టర్ శ్రీలత, అదనపు ఎస్పీ రూపేష్, అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ అరుణ శ్రీ , ఆర్డీవో మాధురి, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల సంక్షేమానికి ఎన్నో సంక్షేమ పథకాలు

### ఎంపీ డా. కె. లక్ష్మణ్

**సికింద్రాబాద్ జులై 14 (ప్రజామంటలు):** సికింద్రాబాద్ నియోజకవర్గం లోని సీతాఫల్ మండి డివిజన్ లోని బిఎన్ఆర్ గార్డెన్స్ లో మేకల కీర్తి



హర్ష కిరణ్ ఆధ్వర్యంలో రాజ్యసభ సభ్యులు, జనతా పార్టీ నేషనల్ ఓబీసీ మోర్చా అధ్యక్షులు డాక్టర్ కె. లక్ష్మణ్ చేతుల మీదుగా అర్హులకు ఈ శ్రమ్ కార్డ్స్, ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డ్, జిల్లా డెవలప్మెంట్ సర్టిఫికెట్ లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎంపీ లక్ష్మణ్ మాట్లాడుతూ..కార్మికుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని, వాటిని వినియోగించుకోవాలని కోరారు. ఈసందర్భంగా స్థానిక బీజేపీ నాయకులు ఎంపీ డా. కె. లక్ష్మణ్ కు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు, సికింద్రాబాద్ మహంకాళి బీజేపీ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శులు శ్యాంసుందర్, మేకల సారంగపాణి, మాజీ మేయర్ బండ కార్తీక రెడ్డి, సీనియర్ నాయకులు బండపల్లి సతీష్, కృష్ణమూర్తి, హరి, వీరన్న, నాగేశ్వరరావు, ప్రకాశ్ రావు, శారదమల్లేశ్, అంబాలా రాజేశ్వర్, హనుమంతు, శ్రీధర్రావు, రాముపర్మ, అనిత, మహేశ్, మంజుల, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్డిఆర్ఎఫ్ బృందాల సహాయంతో ఒడ్డుకు చేరిన కార్మికులు

**కరీంనగర్ రూరల్ జూలై 14 (ప్రజామంటలు):** కరీంనగర్ లోని వల్లంపహాడ్ వాగులో చిక్కుకుపోయిన ఒరిస్సాకు చెందిన 9 మంది ఇటుక బట్టి కార్మికులను మంత్రి గంగుల కమలాకర్ పర్యవేక్షనలో ఎన్డిఆర్ఎఫ్ బృందం సురక్షితంగా ఒడ్డుకు చేర్చి పునరావాస కేంద్రానికి%×% తరలించారు.తెలంగాణ వ్యాప్తంగా గతవారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నగునూర్ వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. గంగాధర మండలం



నారాయణపూర్ పెద్ద చెరువుకు గండి పడడంతో రాత్రికి రాత్రి వాగు ఒడ్డుకు ఉన్న ఇటుక బట్టీల చుట్టూ నీరు చేరాయి.ఇటుక బట్టీల్లో 9 మంది కార్మికులు చిక్కుకున్నారన్న స్థానిక రైతుల సమాచారంతో జిల్లా మంత్రి గంగుల కమలాకర్ స్పందించి హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని సహాయక కార్యక్రమాలు ముమ్మరం చేశారు. దీనిలో భాగంగా రెస్క్యూ టీం, ఎన్డిఅర్ఎఫ్ బృందాలతో పాటు స్పీడ్ బోట్ తెప్పించి 9 మంది ఇటుకబట్టీల కార్మికులను సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. వర్షాలు తగ్గే వరకు పునరావాస కేంద్రానికి తరలిస్తామని మంత్రి గంగుల వెల్లడించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని జాగ్రత్త చర్యలు చేపట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు. రైతులు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఆర్ వి కర్ణన్, సీపీ సత్యనారాయణ, అన్ని శాఖల జిల్లా యంత్రాంగం పాల్గొన్నారు.

## ధర్మపురి లో వరద బాధితులకు అన్నదానం

**ధర్మపురి జూలై 14 (ప్రజామంటలు):** ధర్మపురిలో 1200 మంది వరద బాధితులకు లయన్స్ క్లబ్ వారు అన్నదానం చేశారు. ఇందులో మున్సిపల్ వైస్ ఛైర్మన్ ఇందరపు రామన్న, కాంగ్రెస్ నాయకులు సంగనబట్ల దినేష్, డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ రిక్కల నారాయణ రెడ్డి, పాస్ట్ ముల్టిపుల్ ఛైర్మెన్ లయన్ డా. గుర్రం శ్రీనివాస్ రెడ్డి, మొదటి ఉప గవర్నర్ లయన్ హనుమడ్ల రాజిరెడ్డి, కో ఆర్డినేట్ లయన్ కోదండ రాములు, రీజియన్ ఛైర్మెన్ లయన్ సమ ఎల్లారెడ్డి, జోన్ ఛైర్మెన్ లయన్ చుక్క భీమరాజు, ప్రెసిడెంట్ డా రామకృష్ణ, జక్కు రవీందర్, ట్రెజరర్ సిరుపతి రాజన్న, జక్కు దేవేందర్, పప్పుల శ్రీనివాస్, రంగ హరనాథ్, రంగ శంకరయ్య, పెద్ది శివ, స్తంభంకాడి రమేశ్, స్తంభంకాడి శ్యాం పాల్గొన్నారు.

## ఇండ్లు కూలిపోయి నిరాశ్రయులైన వారిని ప్రభుత్వం ఆదుకోవాలి

**గొల్లపల్లి జులై 14 (ప్రజామంటలు):** గొల్లపెల్లి మండలంలో గత ఐదు





రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఇండ్లు కూలిపోయి నిరాశ్రయులైన వారికి ప్రభుత్వం పునరావాసం కల్పించి అందించి ఆదుకోవాలని బీజేపీ మండల అధ్యక్షులు కట్ట మహేష్ అన్నారు. గత ఐదు రోజులుగా మండలంలోని వివిధ గ్రామాలలో పర్యటించి బాధితుల వివరాలను మండల తహాశీల్దార్ దూలం మధు వినతిపత్రం అందజేశారు. రాపల్లి గ్రామానికి చెందిన నల్ల ప్రకాష్, గొల్లపెల్లి మండల కేంద్రానికి చెందిన పొట్టవత్తిని గంగారాం, భీంరాజ్ పల్లికి చెందిన రేవెళ్ల ఓదయ్య, రెవెళ్ల భీమయ్య, బొమ్మేన వెంకటేష్ గుంజపడుగు గ్రామానికి చెందిన కొత్త బుచ్చవ్వ, పొలం ఎల్లయ్య, మారం లచ్చయ్య, గొంటి గంగయ్య, బొంకూర్ గ్రామానికి చెందిన సాయవేని ఎల్లవ్వ, ముల్కల రాజలింగు, అగ్గిమల్ల గ్రామానికి చెందిన కొలగని చెంద్రయ్య, మారం హరిత, మారం మల్లవ్వ, రెచ్చవేని కొమురవ్వ వెనుగుమట్ల గ్రామానికి చెందిన మెడి గంగ గౌడ్, రాఘవపట్నం గ్రామానికి చెందిన గంగవేని మహేష్, వేముల సత్తవ్వ, చిలువేరి లక్ష్మీరాజము, జంగ వెంకయ్య, ఎనవేణి బాలయ్య,చిలువేరి రాజయ్య, కసాని శంకర్, కొక్కు లక్ష్మా రెడ్డి, ఊట్కూరి మహేందర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, వెలముల రవిందర్ రెడ్డి, అగోళపు నారాయణ, జక్కుల నారాయణ, కోమల్ల రవీందర్, కొలగాని లక్ష్మి రాజం, కసాని లింగయ్య, తీర్మాలపూర్ కలికోట ఆనందయ్య, వేములవాడ బ్రహ్మయ్య, దొంతుల బుచ్చమ్మ వీరందరు ఇల్లు కూలిపోయి నిరాశ్రులయి బిక్కు బిక్కు మంటూ జీవనం కొనసాగిస్తున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు సింహాచలం సత్యనారాయణ, ఊట్కూరి సత్యనారాయణ రెడ్డి, మండల ప్రధానకార్యదర్శి శ్రీపతుల గంగారాం, యువమోర్చా మండల అధ్యక్షులు లక్కకుల వెంకటేష్, మండల ప్రధానకార్యదర్శి కసాని గంగాధర్, బూత్ అధ్యక్షులు బుర్ర తిరుపతి గౌడ్, అంకం రామదాసు, ఎస్‌టి మోర్చా మండల అధ్యక్షులు రమేష్, నాయకులు బోయపోతు రాజు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## వరద భాదిత ప్రాంతాల పర్యటించిన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు

### కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలి

**ధర్మపురి జులై 15 (ప్రజామంటలు):** పట్టణంలో అకాల వర్షాలతో గోదావరి ఉద్రిక్తత ద్వారా ధర్మపురిలోని గోదావరి నది తీరాన ఉన్న



తెనుగువాడ, గంపలవాడ, గోలివాడ, బ్రాహ్మణవాడ, బోయవాడ మారియు నక్కలపెట్ రోడ్ ఇంద్రమ్మ ఫ్లాట్స్ లను జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చేశారు. అవన్నీ అతిఘోరంగా నీటి మయం అయిపోయాయని ఇది చాలా బాధాకరమైన విషయమని, అంతే కాకుండా చాలా మంది ఆర్థికంగా చాలా నష్టపోయారు. గోడలు కూలిపోవడం వల్ల చాలా మంది ఇండ్లు కూలిపోవడం మరియు నిత్యావసర సరుకులు మరియు ఇంట్లో విలువైన వస్తువులు కొట్టుకపోవడం జరిగింది.అంతే కాకుండ గోదావరి తీర ప్రాంతాల్లో ఉన్న చిరు వ్యాపారులకు కూడా ఆదుకోవాలి వీళ్ళందరికి రాష్ట్రం లో అధికారంలో ఉన్నా రాష్ట్ర, కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వాలు వెంటనే వారి వారి నష్టాలను తెలుసుకొని వాళ్ళని ఆర్థికంగా ఆదుకోవాలని లక్ష్మణ్ కుమార్ కోరారు.

## బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి

### బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల లక్ష్మి నారాయణ

**చొప్పదండి జులై 15 (ప్రజామంటలు):** కొన్ని రోజులుగా ఏడ తెరువు లేకుండా కురుస్తున్న వర్షం ప్రభావం వాలా ఆస్థి నష్టం జరిగిన కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల లక్ష్మీనారాయణ డిమాండ్ చేసారు. ఈ మేరకు గురువారం మండలంలోని గుమ్లాపూర్ గ్రామంలో కూలిపోయిన ఇండ్లను సందర్శించి మాట్లాడుతూ... గత ఏడు రోజులుగా కురుస్తున్న వర్షం ప్రభావం వల్ల ఇళ్లులు కూలి పోయి ఆస్తి నష్టం వాటిల్లిన కుటుంబాలకు ప్రభుత్వం ఆదుకోవాలని, వారికి డబుల్ బెడ్ రూమ్ మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



# వరుణుడు శాంతించాలని మంత్రి పూజలు

● **మహంకాళి ఆలయంలో వరుణ శాంతి హెూమం**

**సికింద్రాబాద్, జులై 14 ( ప్రజా మంటలు ):** వరుణ దేవుడు శాంతించి, వర్షాలు తగ్గించాలని పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ కోరారు. గత కొద్దిరోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ఆదేశాల మేరకు సికింద్రాబాద్ లోని శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆలయంలో నిర్వహించిన వరుణ శాంతి హెూమంలో మంత్రి శ్రీనివాస్ యాదవ్ పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం ఈ నెల 17 వ తేదీన మహంకాళి బోనాల సందర్భంగా అమ్మవారికి సమర్పించనున్న చీర తయారీ పనులను మగ్గంపై మంత్రి ప్రారంభించారు. తదనంతరం ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సికింద్రాబాద్ పరిధిలోని 91 దేవాలయాలకు ప్రభుత్వం మంజూరు చేసిన ఆర్థిక సహాయం చెక్కులను మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో నదులు, చెరువులు పూర్తిగా నిండిపోయాయని తెలిపారు. గోదావరి నది గతంలో ఎన్నడూ లేని విధంగా ఉప్పొంగి ప్రవహిస్తుందని అన్నారు. వరుణ దేవుడు శాంతించాలని కోరుతూ వరుణ శాంతి హెూమం నిర్వహించినట్లు తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రయివేట్ దేవాలయాలకు కూడా ఆర్థిక సహాయం అందించిన ఏకైక ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రం అని మంత్రి చెప్పారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బోనాల పండుగను రాష్ట్ర పండుగగా ప్రకటించడం జరిగిందని అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్? ఆదేశాల మేరకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. ఈ సంవత్సరం బోనాల నిర్వహణకు ప్రభుత్వం15 కోట్ల రూపాయలు విడుదల చేయడం జరిగిందని, 3500 దేవాలయాలకు ఆర్థిక సహాయం అందించనున్నట్లు తెలిపారు. ఈ నెల 17 వ తేదీన సికింద్రాబాద్ బోనాలు నిర్వహించనున్న నేపథ్యంలో 91 దేవాలయాలకు 76 లక్షల రూపాయల విలువైన చెక్కులను పంపిణీ చేసినట్లు వివరించారు. ఈ నెల 24 వ తేదీన బోనాలు నిర్వహించనున్న హైదరాబాద్ పరిధిలోని దేవాలయాలకు ఈ నెల 18 వ తేదీన చెక్కుల పంపిణీ చేసేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. బోనాలకు వచ్చే భక్తులు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా వివిధ



శాఖల ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. మహంకాళి ఆలయంకు వెళ్ళే రెండు ప్రధాన రహదారుల లో నిర్మించిన ఆర్చీలను 15 వ తేదీ శుక్రవారం ఉదయం 9.30 గంటలకు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ముందుగా అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఆలయ పరిసరాలలో అధికారులతో కలిసి పర్యటించి అభివృద్ధి పనులు పరిశీలించారు. 2 రోజులలో పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, ఈఈ సుదర్శన్, ఎలెక్ట్రికల్ డీఈ శ్రీధర్, దేవాదాయ శాఖ రీజనల్ జాయింట్ కమిషనర్ రామకృష్ణ, అసిస్టెంట్ కమిషనర్ కృష్ణ, బల్కంపేట, మహంకాళి ఆలయాల ఈవో లు అన్నపూర్ణ, మనోహర్ రెడ్డి, ట్రస్టీ కామేష్, కార్పొరేటర్ లు సుచిత్ర, మహేశ్వరి, హేమలత, కొంతం దీపిక, మాజీ కార్పొరేటర్ లు నామన శేషుకుమారి, అత్తిలి అరుణ గౌడ్, ఆకుల రూప, ఉప్పల తరుణి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణలో బీజేపీ మోసం చేసినదంటూ కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

**జనగామ జూలై 14 (ప్రజామంటలు):** ఎస్సీ వర్గీకరణను బలపరిచి పార్లమెంట్‌లో బిల్లు పెట్టె సమయంలో నిర్లక్ష్యం చేస్తూ బీజేపీ మాదిగలను నమ్మించి మోసం చేసిందని మాదిగ జాతిని పోలీస్ స్టేషన్ లలో నిర్బంధించి బీజేపీ నేతలు మోడీతో బహిరంగ సభ జరుపుకున్నారని, ఇది బీజేపీ పిరికితనానికి పరాకాష్ట అని మాదిగలను నమ్మించి మోసం చేసిన బీజేపీని మాదిగ వాడలకు రానీవొద్దని ఎం.ఎస్.పి. వరంగల్ ఉమ్మడి జిల్లా ఇంచార్జి మందకుమార్ మాదిగ అన్నారు. జనగామ జిల్లా కేంద్రంలో ఎం.ఎస్.పి. అనుబంధ సంఘాల జిల్లా సమీక్ష సమావేశం ఎస్ ఆర్ ఆర్ డిగ్రీ కళాశాలలో ఎం.ఎస్.పి జిల్లా ఇంచార్జి ఇనుముల నర్సయ్య మాదిగ అధ్యక్షత వహించగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.బిజెపి చేసిన మోసాన్ని ప్రతి మాదిగ పల్లెలో వివరిస్తూ సంస్థాగత నిర్మాణం చేసుకుంటూ పోరాటం కొనసాగించాలని అన్నారు. అనంతరం జనగామ చౌరస్తాలో మాదిగలకు ద్రోహం చేసిన బీజేపీ డౌన్..డౌన్ అంటూ కేంద్రప్రభుత్వం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చట్టబద్ధతపై మోసం చేసిన కేంద్రప్రభుత్వ వైఖరిని మోడీ సభలో ఎస్సీ వర్గీకరణ నినాదాలు చేసినందుకు మాదిగల మీద బీజేపీ గుండాయిజంతో దాడులు చేయడం దారుణమని, మాదిగల మీద విచక్షణరహితంగా దాడి చేసిన బీజేపీ గుండాలను తక్షణమే అరెస్ట్ చేసి రౌడీ షీట్ ఓపెన్ చేయాలని అన్నారు. మాదిగలను మోసం చేసినట్లుగానే తెలంగాణ ప్రజలను మోసం చేయడానికి బీజేపీ కుటిల యత్నాలు చేస్తుందని, తెలంగాణ ప్రజలు మోసపోకుండా జాగ్రత్తగా ఉండాలని అన్నారు. వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించకుండా అధికారం లోకి రావడం అవివేకమని అన్నారు. బీజేపీ మాదిగలకు చేసిన ద్రోహాన్ని జాతి మర్చిపోదని ప్రతి గ్రామంలో మాదిగలకు ఎస్సీ వర్గీకరణ చేస్తామని నమ్మించి చేసిన నమ్మకద్రోహాన్ని వివరిస్తూ పోరాటాలను ఉధృతం



చేస్తామని, కేంద్రప్రభుత్వ దిష్టిబొమ్మలను దహనం చేస్తామని ప్రతి జిల్లా, నియోజకవర్గ, మండల కేంద్రంలో 20 నుండి ఆగస్టు 12 వరకు దీక్షలు నిర్వహిస్తామని, వర్గీకరణ చేయకుండా స్పష్టత ఇవ్వకుండా నిర్లక్ష్యం చేసే బీజేపీపై మాదిగల నిరసన ఎక్కడికక్కడ తెలువుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.ఎస్. ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి రాగల్ల ఉపేందర్ మాదిగ, ఎం.అర్. పి.ఎస్ జిల్లా కన్వీనర్ పైసా రాజశేఖర్ మాదిగ, ఎం.ఎస్.పి. రాష్ట్ర నేతలు చుంచు రాజు మాదిగ, మండల ఇంచార్జి నీర్మాల భాస్కర్ మాదిగ, నియోజకవర్గ భాద్యులు కోడిదేటి కుమార్ మాదిగ, జేరిపోతుల సుధాకర్ మాదిగ, సందేన రవీందర్ మాదిగ, గువ్వల రవి మాదిగ, నలిమేల నాగరాజు మాదిగ, మంద శ్రీనివాస్ మాదిగ, సురేష్ మహాజన, కొమ్మగళ్ల కృష్ణమాదిగ, సుంచు సురేందర్ మాదిగ, మచ్చ అబ్బయ్య మాదిగ, చాడ ఏలీయా మాదిగ, అరూరి శ్రీనివాస్ మాదిగ, గోవిందు ఈసాక్ మాదిగ, సంపత్ మాదిగ, కాంతి రాము మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## వర్షాల వల్ల పంటల నష్టం జరగకుండా పాటించాల్సిన పద్ధతులను వివరించిన వ్యవసాయ అధికారి

**హుజురాబాద్ జూలై 14 (ప్రజామంటలు):** హుజురాబాద్ లో బారీ వర్షాలు కురుస్తున్నందున రైతులు తమ పంటలను కాపాడుకునేందుకు పాటించాల్సిన యాజమాన్య పద్ధతులను ఇప్పలనర్సింగపూర్ లో వ్యవసాయ అధికారి చందుపట్ల సునీల్ కుమార్ రెడ్డి క్షేత్ర స్థాయిలో పర్యటించి రైతులకు తెలియజేసినారు. ప్రత్తి లో అధిక వర్షాల నుండి పంట త్వరగా కొలుకోవడానికి పొలాల నుండి నిల్వ ఉన్న నీటిని బయటకు తీసివేయలని, వర్షాలు తగ్గిన తరువాత పత్తి పంట ఎండిపోవడం గమనించితే కాపర్ ఆక్సిక్లోరైడ్ 3 గ్రా. లీటర్ నీటికి కలిపి 5 నుండి 7 రోజుల వ్యవధిలో రెండుసార్లు మొక్కల అడుగుబాగమున తడిచేటట్లు పిచికారీ చేయాలని, పంట త్వరగా కొలుకోవడానికి పాలిఫిడ్ లేదా మల్టీ-కె లేదా యూరియాను 10గ్రా. లీటర్ నీటికి కలిపి వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలని,పంట ఎదుగుదలను పెంచడానికి పొడి వాతావరణం ఏర్పడిన వెంటనే ఎకరానికి 25 కిలోల యూరియా మరియు 10 కిలోల మ్యురేట్ ఆఫ్ ఫోటాష్ వేసుకోవాలని, ఆలస్యంగా విత్తిన పంటలో సరైన మొక్కల సంఖ్య పాటించడానికి మొక్కలు మొలువని చోట మరల విత్తుకోవలని అన్నారు. కలుపు నివారణకు భూమిలో తగిన తేమ ఉన్న సమయములో గుంటుక లేదా గొర్రుతో అంతర కృషి చేసుకోవాలని గడ్డి జాతి మరియు వెడల్పు ఆకు కలుపు మొక్కలను నివారించడానికి క్విజలోఫస్ ఇత్యల్ 2 మీ.లి. లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని అన్నారు. వరి నారుమళ్ళు వేసుకున్నచోట్ల మడిలో నీరు నిలువ ఉండకుండా చూడాలని. వెదజల్లే పద్ధతిలో విత్తుకున్న పొలాల్లో, మడులలో నిలిచిన నీటిని తొలగించాలని. చిన్న మొలకలు అధిక నీటి నిలవను తట్టుకోలేవని. కలుపు మందులు ప్రస్తుతము వాడకుండా ఉంటే



మంచిదని, వాతావరణం మామూలు స్థితికి చేరుకున్నాక సిఫారసులు ప్రకారము ఎరువుల మరియు కలుపు మందులు వాడకం చేయవచ్చు అని తెలిపినారు. వర్షం తగ్గాక, వరి నారు మళ్ళు పండు బారినట్లయితే పైపాటుగా యూరియా ఎకరాకు సరిపోయే నారు మడికి 1.5 నుండి 2 కిలోలు వేయాలని. పిచికారీ లో జింక్ సల్ఫేట్ 2 గ్రా. లీటర్ నీటికి చొప్పున కలిపి పిచికారీ చెయ్యాలని, వరి నారు మడి నారు తీయుటకు వారము పది రోజుల ముందు తప్పనిసరిగా కార్బోఫురన్ 3జి గులికలు 800 గ్రా./ఎకరాకు సరిపోయే 2 గుంటల నారు మడికి వేయాలి అని తెలిపినారు. ఆయనవెంట హుజురాబాద్ వ్యవసాయ విస్తరణ అధికారి పొద్దుటూరి సతీష్ రెడ్డి, రైతు బంధు సమితి మెంబర్ దండ సదశివరెడ్డి, రైతులు ఉన్నారు.

## కరీంనగర్ వరద ప్రభావిత ప్రాంతాల్లో మంత్రి గంగుల పర్యటన

**కరీంనగర్ జూలై 14 (ప్రజామంటలు):** రాష్ట్రంలో గత వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో కరీంనగర్ జిల్లాలో ప్రభావితమైన ప్రాంతాల్లో రాష్ట్ర మంత్రి గంగుల కమలాకర్ స్వయంగా పర్యవేక్షిస్తూ, అప్పటికప్పుడు సహాయక చర్యలు చేపడుతున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాలతో అన్నిరకాల ముందస్థు జాగ్రత్తలు తీసుకొని, జిల్లా యంత్రాంగం మొత్తం అప్రమత్తంగా ఉన్నామన్నారు. ముందస్థుగా ప్రమాదాలు జరగకుండా తీసుకున్న చర్యలతో రోడ్లపై ప్రమాదకర పరిస్థితులు, నీటి నిలువ లేకుండా చర్యలు తీసుకోవడంతో పాటు మానేరు ముంపు గ్రామాల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసామన్నారు. ఈరోజు గురువారం ఉదయం నుండి క్షేత్రస్థాయిలో ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగంతో వర్షంలోనే తిరుగుతూ సహాయక చర్యల్ని పర్యవేక్షిస్తున్నారు, నగరంలోని వల్లంపాడు నుండి తీగలగుట్టపల్లి వరకూ స్వయంగా కాలినడకన తిరుగుతూ ప్రజల మంచి చెడుల్ని తెలుసుకున్నారు. ఇరుకుల వాగు ఉద్రుతి పెరుగుతుండడంతో అక్కడి ఇటుక బట్టీల్లో పనిచేస్తూ ఇబ్బంది పడుతున్న తొమ్మిది మంది వేరే రాష్ట్రానికి చెందిన వలస కార్మికులను కాపాడి స్థానికంగా ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించారు. అంటువ్యాదులు ప్రభలకుండా చర్యలు తీసుకుంటున్నామని ముసురుకు తోడు, వరదతో నీళ్లు నిండిన ప్రాంతాల్లో సంచార వైద్య బృందాలను తిప్పుతున్నామని ఎవరికి ఎలాంటి వైద్య సహాయం అవసరమైనా తక్షణమే స్పందిస్తున్నామన్నారు మంత్రి గంగుల. నగరంతో పాటు జిల్లా మొత్తంలో ఎలాంటి ప్రాణనష్టం, ఆస్థినష్టం జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకున్నామన్న మంత్రి, ఇందుకోసం యావత్ ప్రభుత్వ యంత్రాంగం క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉందన్నారు. మానేరు, ఇరుకుల వాగుల పరివాహకంలో సంపూర్ణ జాగ్రత్త చర్యల్ని ప్రభుత్వం తీసుకుందన్నారు. ప్రజలు



అత్యవసరమైతేనే బయటకు రావాలని, విద్యుత్ స్థంబాలు, నీటి కుంటల వద్దకు వెళ్లోద్దని విజ్ఞప్తి చేసారు మంత్రి గంగుల కమలాకర్. ఈ కార్యక్రమంలో నగర మేయర్ సునీల్ రావు, డిప్యూటీ మేయర్ చల్లా స్వరూప హరిశంకర్, కలెక్టర్ కర్ణన్,కమీషనర్ సత్యనారాయణ అన్ని శాఖల జిల్లా యంత్రాంగం పాల్గొన్నారు.



మల్లాపూర్ మండలం ఓబులపూర్ వద్ద భారీ వర్షానికి ధ్వంసమైన జాతీయ రహదారిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు. తాత్కాలికంగా రోడ్డు మరమ్మతులు చేసిన సర్పంచ్.

## నూతన ఆవిష్కరణలకు మంచి అవకాశం

**జనగామ జూలై 14 (ప్రజామంటలు):** ప్రతి ఒక్కరికి నూతన ఆవిష్కరణలను రూపొందించేందుకు ఇన్నోవేటర్ కార్యక్రమం ఏర్పాటు



చేయడం జరిగిందని తప్పనిసరిగా వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ సిహెచ్ శివలింగయ్య కోరారు. సృజనాత్మక శక్తిని పెంపొందించేందుకు ఆవిష్కరణలు తోడ్పడతాయని ప్రతి ఒక్కరు వినియోగించుకొని మరిన్ని ఆవిష్కరణలను రూపొందించాలన్నారు. ఇది ఒక సదవకాశంగా భావించాలన్నారు. దీనిపై విస్తృత ప్రచారం అవసరమని ప్రతి ఒక్కరికి తెలియాల్సిన అవసరం ఉందన్నారు నిత్యం ఎన్నో అంశాలు కళ్ళముందే ఉంటాయని వాటినే సులభ పద్ధతిలో ప్రదర్శించడమే ఇన్నోవేటర్ కార్యక్రమం అన్నారు. ఇన్నోవేటర్ కార్యక్రమం వల్ల ఆలోచన శక్తి పెరుగుతుందని వారిలో అంతర్లీనంగా నిబిడీకృతమైన ఆలోచనలు పదును పెట్టడం ద్వారా సరికొత్త ఆవిష్కరణలు ఉద్భవిస్తాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు వయసుతో నిమిత్తం లేదని ప్రతి ఒక్కరు అర్హులేనని తమ ఆలోచనలకు పదును పెట్టి ఆవిష్కరణలను రూపొందించుకొని మరిన్ని అందజేయాలన్నారు.

## నిండుకుండలా నిండిన పెద్ద చెరువు

### ముందస్తు చర్యలు తీసుకున్న సర్పంచ్

**ఇబ్రహీంపట్నం జూలై 14 (ప్రజామంటలు):** ఇబ్రహీంపట్నం మండలంలోని వర్షకొండ గ్రామంలోని పెద్ద చెరువు గత వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షలతో నిండుకుండ గా మారి కట్ట తెగే



ప్రమాదం అంచుకు చేరడంతో దాన్ని గ్రహించిన గ్రామ నాయకులు గ్రామ కార్యదర్శి రాకేష్ వెంటనే తహసిల్దార్ మహేశ్వర్ కు తెలిపారు. అధికారులు గ్రామ ప్రజా ప్రతినిధులు స్పందించి చెరువుకు ముందు భాగంలో మత్తడిన కి ఉన్న ఇరవై పెద్ద రాళ్లను జేసీబీ తో తొలగించడం జరిగింది, దీనితో గ్రామానికి, చెరువు కు పెద్ద ప్రమాదం తప్పింది, అయితే మిషన్ కాకతీయ ద్వారా మొరం పోసిన కట్ట కు లోపటి సైడ్ రాళ్లు అడ్డం పెట్టకపోవడంతో ఇట్టి ప్రమాదం తలెత్తిందని గ్రామస్తులు తెలిపారు, ఇకనైనా చెరువు కట్టను బాగుచేయాలనీ గ్రామ ప్రజలు కోరుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ మహేశ్వర్ గారు. గ్రామ సర్పంచ్ దొంతుల శ్యామల తుకారాం. ఎంపీటీసీ పొనుకంటి చిన్న వెంకటి, వ్యవసాయ కమిటీ డైరెక్టర్ దోమకొండ చిన్న రాజన్న, కార్యదర్శి రాకేష్, ఆర్ఐ భూమేష్, విఆర్ఏ ప్రేమ్ కుమార్, గ్రామ నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## మత్తడి పారుతున్న భద్రకాళి, వడ్డేపల్లి చెరువులు

### లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసిన అధికారులు

**హన్మకొండ జులై 15 (ప్రజామంటలు):** నగరంలో కీలకమైన భద్రకాళి, పెద్ద వడ్డేపల్లి చెరువులు సోమవారం నుంచి మత్తడి పడుతున్నాయి. భద్రకాళి నిల్వ సామర్థ్యం 150 మిలియన్ క్యూబిక్ ఫీట్లు(ఎంసీ ఎల్టీలు) కాగా.. పూర్తిగా నిండటంతో కాపువాడ వైపు అలుగుపోస్తోంది. హనుమకొండ వడ్డేపల్లి చెరువు 135 ఎంసీ ఎల్టీలు కాగా పూర్తిగా నిండటంతో అలుగు పోస్తున్నాయి. దిగువున ఉన్న కాలనీలు ముంపునకు గురి కాకుండా ముందస్తు పనులు చేపట్టారు. వడ్డేపల్లి చెరువు మత్తడి నీళ్ల కేయూసీగీ 100 ఫీట్ల రోడ్డు, అమరావతినగర్, సమ్మయ్యనగర్, విద్యానగర్, నయీంనగర్ వంతెన, పోచమ్మకుంట, భగత్ సింగ్ నగర్ మీదుగా నగరం దాటుతాయి. భద్రకాళి మత్తడి నీరు అలంకార్ పెద్దమోరీ, కాకతీయ కాలనీ, పెద్దమ్మగడ్డ మీదుగా నాగారం చెరువులోకి వెళ్తాయి. వరదలపై బల్దియా ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంకు 10 కాలనీల్లో వరదనీరు ఆగిందని స్థానికులు ఫిర్యాదు చేశారు. వెంటనే ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగి నీటిని మళ్లించాయి. భట్టుపల్లి గ్రామంలో పాత ఇల్లు స్వల్పంగా కూలిందని ఫిర్యాదు రాగా టౌన్ ప్లానింగ్ ఉద్యోగులు జేసీబీ తో పూర్తిగా తొలగించారు. వరంగల్ డీ మార్ట్ వద్ద, మైసయ్యనగర్, పుప్పాలగుట్ట, చైతన్యపురి కాలనీ వద్ద డ్రైనేజీని క్లియర్ చేశారు. కాజీపేట సోమిడి, విష్ణుపురిలో కూలిన చెట్లను డీఆర్ఎఫ్ బృందం తొలగించింది. ప్రకృతి వైపరిత్యాలను ఎదుర్కోవడానికి అందరూ మానసికంగా సిద్దంగా ఉండాలని ప్రజలను, అధికారులను జిడబ్ల్యూఎంసి కమిషనర్ కోరారు.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE.
EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL/2021/81092.
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com